# మనం
## ఖమ్మం
### భద్రాద్రి కొత్తగూడెం - మహబూబాబాద్
గురువారం | 20 | జూలై | 2023 | పేజీలు : 10


## బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్ అభిలాష



**ఖమ్మం, జూలై 19(మనం బ్యూరో) :** ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టరుగా అభిలాష అభినవ్ బుధవారం ఉదయం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. మహబూబాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా పని చేస్తున్న అభిలాష అభినవ్ ని ప్రభుత్వం ఇటీవల ఖమ్మం జిల్లాకు బదిలీ చేసింది. అదనపు కలెక్టర్ స్వస్థలం బీహార్ రాష్ట్రం పాట్నా కాగా, 2017 సివిల్ సర్వీస్ పరీక్షల్లో 18 ర్యాంక్ సాధించారు.

# రోజంతా వాన



**-భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి**
**-రాత్రి పది గంటలకు 35.20 అడుగులు**
**- భద్రాచలం, కొత్తగూడెంలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**
**సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం**
**ఖమ్మం జిల్లా జలాశయాల్లోకి వస్తున్న వరద నీరు**



**ఖమ్మం, జూలై 19(మనం బ్యూరో) :** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం మొదలుకుని బుధవారం రోజంతా వాన కురుస్తూనే ఉంది. దీంతో ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేశారు. భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతూ వస్తోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం బుధవారం రాత్రి 10 గంటలకు 35.20 అడుగులకు చేరినట్లు జిల్లా కలెక్టర్ డా ప్రియాంక అలా తెలిపారు. భద్రాచలం నుండి 5 లక్షల 97 వేల 982 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నట్లు చెప్పారు. గురువారం ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటికి రావొద్దని చెప్పారు. ఏదేని అత్యవసర సేవలకు 24 గంటలు పనిచేయు విధంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములకు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు భద్రాచలం, కొత్తగూడెం ఆర్డిఓ కార్యాలయాలు, ముంపు మండల తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. భారీ వర్షాలు, గోదావరి వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యవసర సేవలకు కొత్తగూడెం, భద్రాచలంలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొత్తగూడెం కలెక్టరేట్ కంట్రోల్ రూం నెం. 08744-241950, వాట్సప్ నెంబరు 9392919743 , కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం వాట్సప్, కంట్రోల్ రూము నెంబరు 9392919750, భద్రాచలం సబ్ కలెక్టరు కార్యాలయంలో 08743-232444 కంట్రోల్ రూము నంబర్, వాట్సప్ 7981219425 కు మెసేజి కానీ వీడియో ద్వారా సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు.

**బొగ్గు ఉత్పత్తికి ఆటంకం**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు, కోయగూడెం, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ఓసిల్లో నీరు నిల్వ ఉండడం వల్ల బొగ్గు వెలికితీతకు సాధ్యపడలేదు. దీని వల్ల సింగరేణికి భారీగా నష్టం వాటిల్లింది.

# పాత పథకాలకు పాతర..
# కొత్త పథకాలతో ఎర

**మణుగూరు, జూలై 19 (మనం న్యూస్) :** ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త కొత్త పథకాలతో దూసుకపోతున్నా పాత పథకాలను పక్కనపెట్టారనే చెప్పొచ్చు. రాబోవు సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ గులాబీ దళం కొత్త పథకాలై దళిత బంధు, బీసీ బందు వంటి వాటితో ప్రజలకు చేరువయ్యే విషయాన్ని ఎలక్షన్స్ స్టంట్ గానే చూడొచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రభుత్వ దవాఖానాలోప్రసూతి పొందిన మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కేసీఆర్ కిట్ పథకం మహిళలకు ఎంతో దగ్గరైంది. ఈ పథకంలో భాగంగా ఆడ శిశువు పుడితే 13000,అని మగ శిశువు పుడితే 12000 నగదు ప్రోత్సాహం మూడు దఫాలలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. అయితే రెండు సంవత్సరముల నుండి ప్రసూతి పొందిన మహిళల అకౌంట్లో నగదు




**కొత్త పథకాలు అనేవి ఎలక్షన్ స్టంట్ గానే భావించాలా**
**కెసిఆర్ కిట్లతోనే సరిపెడుతున్న ప్రభుత్వం**
**రెండు సంవత్సరాల నుండి నగదు ప్రోత్సాహ జాడే లేదు**

ప్రోత్సాహం అందించే విషయంలో జాప్యం జరుగుతోంది. కెసిఆర్ కిట్ ఒకటే ఇస్తూ నగదు ప్రోత్సాహాన్ని ఆపి న్యూట్రిషన్ కిట్ అనే కొత్త పథకం తో గర్భం దాల్చిన మహిళలకు అందజేసింది. ఈ కొత్త పథకం కూడా మొదలుపెట్టిన కొన్ని నెలల్లోనే సరిపడా కిట్లు లేక గర్భం దాల్చిన మహిళలకు అందరికీ అందీయ లేకపోయారు. తదుపరి హుజురాబాద్ మధ్యంతర ఎలక్షన్స్ లో గులాబీ దళ నాయకుడు దళితులందరికీ 10 లక్షల రూపాయల ప్రోత్సాహక నగదును ప్రకటించాడు. ఒక 2లో..



## ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ

**పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మెచ్చా**

వివరాలు 9లో..



# పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి

## కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ సమీక్ష

## జిల్లాలో 3,11,317 మంది పిల్లలకు మాత్రలు



**ఖమ్మం, జూలై 19(ఖమ్మం బ్యూరో) :** ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. జూలై 20 గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని, బుధవారం ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్, జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి, జిల్లా కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, సరైన ఎదుగుదల ఉండదని, వీటిని నియంత్రించి, ఆరోగ్య సమాజం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆల్బెండొజల్ మాత్రల వల్ల ఎటువంటి హానీ ఉండదని, నులిపురుగులను అరికట్టడానికి ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికి ఈ మాత్రలు వేయాలని ఆయన తెలిపారు. ఈ మాత్రల వల్ల పిల్లల్లో వచ్చే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, బరువు తగ్గడం, కడుపునొప్పి ఇలాంటి వాటిని నివారించవచ్చని కలెక్టర్ అన్నారు. పిల్లల ఆరుబయట వట్టి కాళ్ళతో ఆడుకోవడం, మట్టిలో ఆడి చేతులు కడుక్కోకుండా భోజనం చేయడం, పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచడం లాంటి వాటివల్ల నులిపురుగులు తయారవుతాయని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై పిల్లల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 3,11,317 మంది ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు పిల్లలు ఉన్నట్లు, వీరందరికి నేడు మాత్రలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. భోజనం తర్వాత ఒకటి నుండి 2 సంవత్సరాల వయస్సు వారికి సగం మాత్ర, రెండు నుండి మూడు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర క్రష్ చేసి ఇవ్వాలని, 3 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయస్సు వారికి మాత్ర మ్రింగించాలని ఆయన తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, వారిని భాగస్వామ్యం చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం కు సంబంధించి రూపొందించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి, జెడ్పి సిఇఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డిసిహెచ్ఓ డా. వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె. సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కృష్ణ నాయక్, జిల్లా ఇంటర్ మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, సిఎంఓ రాజశేఖర్, ప్రోగ్రాం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి పుణ్యక్షేత్రంలో.....పడకేసిన పారిశుధ్యం

## భారీగా పేరుకుపోయిన చెత్త

## భారీ వర్షాలు,గోదావరి వరదలు వలన పొంచి ఉన్న ప్రమాదం

## 14 రోజులకు చేరుకున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

## ప్రభుత్వం వెంటనే స్పందించాలని ప్రజల డిమాండ్



**భద్రాచలం, జూలై 19( మనం న్యూస్):** భద్రాచలం పట్టణంలో కొలువైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధిలో పలు కాలనీలు, రహదారులపై చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పుణ్యక్షేత్రమైన భద్రాద్రికి వచ్చే భక్తులు, సందర్శకులకు రామాలయ పరిసరాలతో పాటు ప్రధాన రహదారులు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడం, పట్టణ ప్రజలు రహదారులపై చెత్తాచెదారం పేరుకు పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రబలు రోగాల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికే భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా పలువురు జ్వరాల బారిన పడి ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదిస్తున్నారు. అక్కడ నయం కాకపోవడంతో కొందరు ప్రైవేటు ఆసుపత్రులను సైతం ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

**భారీ వర్షాలు , గోదావరి వరదలతో పొంచియున్న ప్రమాదం**

భద్రాచలం పట్టణంలో పారిశుధ్య కార్మికులు గత 14 రోజులుగా తమ వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మె వలన పట్టణంలో చెత్తా,చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డుమీద నడవాలంటేనే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విరామం లేకుండా కురుస్తున్న వర్షం వలన చెత్తా, చెదారం అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తుంది. దీనికి తోడు గోదావరి నదికి వరదలు కూడా పోటెత్తున్నాయి. గోదారి వరద స్లూయిస్లు ద్వారా వరద పట్టణంలోని కి ప్రవేశిస్తే మరింత ప్రమాదం పొంచి ఉంది.

**కార్మికుల సమ్మెకు పలువురి మద్దతు**

పలువురు ప్రజాసంఘాల, వివిధ పార్టీలు నాయకులు గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరవింపజేయాలని డివిజన్ ప్రజలతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

**వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి.....**

భారీ వర్షాలు, పారిశుధ్య కార్మికుల సమ్మె వలన ప్రతి గ్రామంలో చెత్త పేరుకుపోయి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వెంటనే ప్రతి గ్రామంలో వైద్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

# దేశ సమస్యలపై కేంద్రాన్ని నిలదీస్తాం

## యూసీసీ , ద్రవ్యోల్బణం, విభజన సమస్యలపై రాజీలేని పోరు

## గవర్నర్ల వ్యవస్థపై చర్చకు పట్టు

## సమావేశాల గడువు పొడిగించాలి

## బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు



**ఖమ్మం, జూలై 19(ఖమ్మం బ్యూరో) :** దేశంలో జరుగుతున్న అనేక సమస్యలపై రేపటి వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున చర్చకు పట్టు బడుతుందని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు సమస్యలపై చర్చ చేపట్టాలని బుధవారం జరిగిన అఖిల పక్ష సమావేశం లో కేంద్రాన్ని కోరామని చెప్పారు. యూనిఫామ్ కామన్ సివిల్ కోడ్ ,మణిపూర్ అంశంపైనా పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రాన్ని నిలదీస్తామన్నారు. మణిపూర్ అల్లర్లపై ప్రధానమంత్రి స్టేట్మెంట్ ఇవ్వాలని.. ఆ అంశంపై చర్చ చేపట్టాలని కోరామన్నారు. అలాగే గవర్నర్ల అంశంపై కూడా చర్చ చేపట్టాలని కోరామన్నారు. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల తీరు వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇందుకు అనేక ఉదాహరణలున్నాయని,ఈ అంశంపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చ జరపాల్సిందేనని అఖిలపక్షం సమావేశంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. దేశంలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లులకు ఆమోదం తెలపకుండా ఎలా ఇబ్బంది పెడుతున్నారో చూస్తూనే ఉన్నామని చెప్పారు.తమిళనాడులో ఒక మంత్రిని గవర్నర్ తొలగించిన తీరును అఖిల పక్ష సమావేశంలో మాట్లాడామన్నారు.ఈ అంశంలో చర్చ జరగాలని చెప్పామన్నారు. రైతు సమస్యలపై పోరాటం జరిగినప్పుడు కేంద్రం పలు హామీలు ఇచ్చింది.. ముఖ్యంగా రైతులకు మద్దతు ధర సహా ఇతర అంశాలపై చర్చ జరగాలని కూడా కోరామని, నిరుద్యోగ సమస్య, పెరుగుతున్న నిత్యవసర ధరలు, పెండింగ్ లో ఉన్న విమెన్స్ రిజర్వేషన్ బిల్లుపై చర్చ చేపట్టాలని కోరామని, ఈ అంశాలపై బీఆర్ఎస్ పార్లమెంట్ సాక్షిగా పోరాడుతుందన్నారు. నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణం, ధరలు, ఎస్సీ ఎస్టీ మైనార్టీ, జాతీయ జనగణన అంశాలపై కూడా చర్చ చేపట్టాలని కోరామని, రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పి రిపేర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన అంశాలపైనా కూడా పార్లమెంట్ లో కేంద్రాన్ని నిలదీస్తామని అన్నారు. తెలంగాణ పెండింగ్ అంశాలతోపాటు పెండింగ్ బకాయిలపై కూడా చర్చకు అవకాశం ఇవ్వాలని అఖిల పక్ష సమావేశం లో కోరామని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, సమస్యల సాధనకు పెద్ద ఎత్తున పార్లమెంట్ సమావేశాల్లో లెవనెత్తుతామన్నారు.తెలంగాణా అభివృద్ధిలో అన్ని అంశాల్లో నెంబర్ వన్ గా ఉందన్నారు. పవర్, ధాన్యం ఉత్పత్తి లోను, తలసరి ఆదాయంలో తెలంగాణా నెంబర్ వన్ గా ఉన్న విషయాన్ని పార్లమెంట్ లో వెలుగెత్తి చాటుతామని చెప్పారు. రైలు ప్రమాదాలపై చర్చ జరుపుతా మన్నారు. .కేవలం బిల్లుల ఆమోదానికి సమావేశాల సమయం తక్కువుగా ఇచ్చారని, సమావేశాల గడువు పొడిగించాలని నామ కోరారు తెలంగాణ ఏర్పడిన 9 ఏళ్లలోనే ఎంతో అభివృద్ధి సాధించామని, దేశానికి అనేక అంశాల్లో తెలంగాణా రోల్ మోడల్ గా నిలుస్తుందని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.అఖిల పక్ష సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ నేత కే. కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలిః జెడ్పీటిసి శ్రీలత



**బూర్గంపహాడ్, జులై 19( మనం న్యూస్)ః** మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరి నదికి వరదలు కూడా వస్తున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్గంపహాడ్ జెడ్పీటిసి కామిరెడ్డి శ్రీలత కోరారు. అధిక వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు ఇంటి వద్దనే ఉంటూ అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలతో పాటు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇంట్లో పిల్లలను సైతం బయటకి రానీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని వాగులన్నీ ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, కిన్నెరసాని వాగు ఎప్పుడైనా పొంగి పోర్లవచ్చని, ఈ నేపథ్యంలో గేదెల కాపరులు, రైతులు సైతం ఈ కాలువలు దాటవద్దు అని, అదే నేపథ్యంలో ఇండ్లల్లో ఉండి ఆరోగ్య క్షేమరిత్య ప్రతి ఒక్కరూ వేడి నీటిని త్రాగాలని సూచించారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీ కార్మికులు దీక్షలో ఉన్నందున పరిసరాలలో పరిశుభ్రతను ప్రజలే శుభ్రం చేసుకొని, నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు చూసుకోవాలని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులూ ఉన్నా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

# పాత పథకాలకు పాతర..

(మొదటి పేజీ తరువాయి)

విడత ఆ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలు వారి వారి కార్యకర్తలకు ఆ దళితబందు పథకాన్ని వచ్చేలా చూశారు. రెండో విడత దళిత బందు లీస్టులకే పరిమితమైందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పుడు కొత్తగా బీసీ బందు అని కొత్త పథకాన్ని మొదలుపెట్టి బీసీ లందరికీ వారి వారి కులవృత్తులకు సహకారం అందించే ప్రయత్నంలో లక్ష రూపాయలు అందిస్తున్నారు. ఇలా కొత్త కొత్తగా అందించే పథకాలన్నీ కూడా రాబోవు సార్వత్రిక ఎన్నికలకు ప్రజలకు దగ్గర అవ్వాలనే ఉద్దేశంతోనే బి ఆర్ ఎస్ పార్టీ పాత పథకాలను మరిచి ఇలా కొత్త పథకాలతో ప్రజలకు ఎరవేస్తుంది. ప్రభుత్వంలో బడ్జెట్ లేక పాత పథకాలను పాతర వేస్తున్నారో లేక ఏ విషయంపై ఈ పథకాలకు ఆపుతున్నారో తెలియాల్సి ఉంది.

# సిపిఎం సీనియర్ నాయకురాలు భూక్య సాలి ఆకస్మిక మృతి

## ఎర్ర జెండా కప్పి నివాళులర్పించిన తమ్మినేని వీరభద్రం



**తిరుమలాయపాలెం, జూలై 19 (మనం న్యూస్) :** తిరుమలయపాలెం మండలం హైదర్ సాయి పేట గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు భూక్య సాలి బుధశారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆమెకి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కువారుడు మాజీ సర్పంచ్ భూక్య వెంకన్న సిపిఎం ఆర్గనైజరుగా ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గ్రామానికి చేరుకుని సాలి భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ తన జీవితాంతం ఎర్రజెండా బాటలో పయనించాలని, ఆమె మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్పీ బసీరుద్దీన్ సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను సిపిఎం మండల కమిటీ సభ్యులు దాసరి మహేందర్ పుసులూరి వీరభద్రం మందడి ఆనందరావు దాసరి వీరభద్రం మట్ట కృష్ణారావు వెంకటాచారి బోడ బాలు భూక్య వెంకన్న ఎస్కే ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

**టీపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు నివాళి**

అనారోగ్యంతో మరణించిన గ్రామ మాజీ సర్పంచ్ వెంకన్న మాతృమూర్తి భూక్యా సాలి భౌతిక దేహానికి టీపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్ జూలకంటి సాగర్ రెడ్డి పోట్ల కిరణ్ అజ్మీర బాలాజీ ఎన్ యస్ యు ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు జి.మోహన్ గ్రామ కాంగ్రెస్ ఖాదర్ శంకర్ మాజీ ఎంపీటీసీ భద్రయ్య ఉపేందర్ దేశ్యా యూత్ కాంగ్రెస్ మండల కో ఆర్డినేటర్ బత్తుల రమేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీను రమేష్ పాల్గొన్నారు.

**నంద్యాల రవీందర్ రెడ్డి నివాళి**

హైదర్ సాయి పేట గ్రామ మాజీ సర్పంచ్ భూక్య వెంకన్న మాతృమూర్తి భూక్య సాలి భౌతికకాయాన్ని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైయస్ షర్మిల రెడ్డి పాలేరు నియోజకవర్గం వ్యక్తిగత సహాయకులు నంద్యాల రవీందర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్టిపి మండల ప్రధాన కార్యదర్శి అన్న బత్తుల కృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోత్ సీతారాం నాయక్ గ్రామ శాఖ నాయకులు దేవా, వైయస్సార్ అభిమానులు దాసరి భద్రయ్య చీమల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



**కూసుమంచి ,జూలై 19 ( మనం న్యూస్ ) :** కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమల పాలెం, ఖమ్మం రూరల్ మండలం గ్రామపంచాయతీ కార్మికులు ,పాలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే లేనందున పి ఆర్ ఓ రాములు కి వినతిపత్రం అందచేశారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను విరమింప చేయాలని రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఖమ్మం జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కూసుమంచి మండల కేంద్రంలో భారీ ప్రదర్శన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది .ఈ సదస్సుకి ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న అధ్యక్ష వహించారు. సీఐటీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి .ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మణ్ నారాయణ. ఐఎఫ్టియు సహాయ కార్యదర్శి ఆవుల అశోక్ కుమార్ పాల్గొని మాట్లాడారు. 14 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం సరికాదనీ అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాలలో పారిశుధ్యం దెబ్బతిని సీజనల్ వ్యాధులు ప్రభులే అవకాశం ఉందని కావున ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మె విరమణ దిశగా కృషి చేయాలని వారు కోరారు. ప్రభుత్వ స్పందించకుంటే లేనియెడల రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలతో కలుపుకొని సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమానికి సంఘీభావంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి సిపిఐఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్దినేని కర్ణ కుమార్ సిపిఐ ఎంఎల్ ప్రజాపందా పాలేరు డివిజన్ కార్యదర్శి సి వై పుల్లయ్య పి ఓ డబ్ల్యు ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మి ఐఎఫ్టియు నాయకులు పి రామదాసు సీఐటీయూ నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు సిపిఐనాయకులు గుండె పొంగు మల్లేష్ కొమ్ము అశోక్ కొరట్ల గణేష్ నల్లగాటి ప్రవీణ్ జంగిలి వెంకటనారాయణ గోపె సైదులు రమేష్ సాయి బిక్షం నాలుగు మండలాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# దళిత ,గిరిజనులకే రాజ్యాధికారం కావాలి

### ఓట్లలో మేము – పాలనలో మీరు

### ఎన్నాళ్లు ఇంకెన్నాళ్లు : రానున్న ఎన్నికల్లో మార్పు తథ్యం

### – గిరిజన సంఘం నేత సురభి



**కూసుమంచి ,జూలై 19 ( మనం న్యూస్ ) :** పాలేరు నియోజకవర్గంలో దళిత గిరిజనులు అధికంగా ఉన్నారని, కానీ రాజ్యాధికారం కాడికి వచ్చేసరికి అగ్రవర్ణాల వారు మాత్రమే రాజ్యాలు ఏలుతున్నారని, గిరిజన సంఘం నేత సురభి ఆరోపించారు. బుధవారం ధర్మ తండాలో జరిగినమండల స్థాయి జనరల్ బాడీ మీటింగ్లో ఆయన మాట్లాడుతూ, కులాల వారిగా వివరాలు వెల్లడి చేస్తూపాలేరు నియోజకవర్గం కులాల వారిగా ఓట్లు లంబాడి ల ఓట్లు నియోజకవర్గ వ్యాప్తంగా 37385 వేలు కలవని నియోజకవర్గ వ్యాప్తంగా ఇంత పెద్ద మొత్తంలో ఉన్న గిరిజన సంఘం ఓట్ల నుండి గెలుపొందిన ప్రజా ప్రతినిధులు, ఈసారి రానున్న ఎన్నికల్లో ఒక గిరిజన నాయకున్ని ఎమ్మెల్యేగా నిలబెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పాలేరు నియోజకవర్గం ఏర్పడిన నుండి ఈరోజు వరకు ఒక్క గిరిజనుడిని కూడా ఎమ్మెల్యేగా నిలబెట్టలేదని ఎన్నుకోలేదని ఆయన ఆరోపించారు. అదేవిధంగా కులాలవారీగా చూసినట్లయితే నియోజకవర్గ వ్యాప్తంగా ఈ విధంగా ఉన్నాయి అని ఆయన వివరంగా తెలియజేశారు ,మాదిగ ఓటర్లు.31750 వేల ఓట్లు ఉన్నాయన్నారు. యాదవ్ కులం వారి ఓట్లు.20311 వేలు ఉన్నాయన్నారు. .కమ్మ. వారి ఓట్లు.16750 ఉన్నాయని తెలిపారు. ముదిరాజ్ వారి ఓట్లు 16000..వేలు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నాయన్నారు. మాల. కులం వారి ఓట్లు 14600 వేలు ఉన్నాయన్నారు. గౌడ. ఓట్లు.14131 వేలు ఉన్నాయి అని తెలిపారు. ముస్లిం ల ఓట్లు.9000 వేలు ఉన్నాయన్నారు. రెడ్డి కులస్తుల ఓట్లు.8073 వేలు ఉన్నాయన్నారు. చాకలి వారి ఓట్లు.7761 వేలు ఉన్నాయని చెప్పారు. మున్నూరు కాపు ఓట్లు..7000 వేలు అన్నారు .వడ్డెర కులస్తుల ఓట్లు. 4700 వేలు అని తెలిపారు. ఇతరుల ఓట్లు 25000 అనగా ( పద్మశాలి. మీర ఏరుకల కుమ్మరి. మొదలగు) కులాల వారివి ఇన్ని వేల ఓట్లు ఉన్నాయని తెలిపారు కనుక రానున్న రోజుల్లో ఈ కులాల వారందరూ ఏకమై , దళిత గిరిజనుల రాజ్యాధికారం తీసుకురావడం కోసం అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. , ఈ కార్యక్రమంలో గిరిజన నేతలు అందరూ పాల్గొన్నారు.

# సోలార్ పార్కింగ్ షెడ్ నిర్మాణ ప్రగతిని పరిశీలించిన కలెక్టర్



**ఖమ్మం, జూలై 19(మనం బ్యూరో) :** ఐడిఓసి లో అధికారులు, సిబ్బంది వాహనాల పార్కింగ్ కొరకు రూ. 100.78 లక్షలతో నిర్మిస్తున్న సోలార్ పార్కింగ్ షెడ్ నిర్మాణ ప్రగతిని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ బుధవారం పరిశీలించారు. పనులు పురోగతిలో ఉన్నట్లు, 6 షెడ్ల నిర్మాణానికి గాను 3 షెడ్ల నిర్మాణం పూర్తయినట్లు ఆయన అన్నారు. పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఇట్టి సోలార్ షెడ్ తో 100 కిలో వాట్ సోలార్ పవర్ ప్లాంట్, గ్రిడ్ కు అనుసంధానం చేస్తారని కలెక్టర్ తెలిపారు.

# పాఠశాల స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

## టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు



**నేలకొండపల్లి, జూలై 19(మనం న్యూస్) :** పాఠశాల స్వీపర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్లో గత 24 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రిలే నిరవధిక దీక్షలు చేస్తున్న పాఠశాల స్వీపర్ల దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంపూర్ణ సంఘీభావం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పాఠశాలలో వెట్టి చాకిరి చేస్తున్న పాఠశాల స్వీపర్ల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాల స్వీపర్లను ఫుల్ టైం స్వీపర్లుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 27 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పాఠశాల స్వీపర్లు చేసే పోరాటానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజని, మండల నాయకులు ఎడవల్లి నాగరాజు, చిట్యాల రమేష్, ధరావత్ సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

## సమ్మెను విచ్చిన్నం చేయడానికి కుట్రలు

## టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు

**నేలకొండపల్లి, జూలై 19(మనం న్యూస్) :** గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్లో గత 14 రోజులుగా జోరు వానను సైతం లెక్కచేయకుండా పంచాయతీ కార్మికులు చేపట్టిన రిలే నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంపూర్ణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది కరోన వంటి భయంకర వ్యాధి వ్యాపించిన క్లిష్ట పరిస్థితులలో కూడా తమ ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారనీ అన్నారు. గ్రామీణ ప్రజల జీవన విధానంలో ముఖ్య భూమిక పోషిస్తున్న పంచాయతీ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమ్మె చేస్తున్న కార్మికుల పట్ల వివక్ష చూపించడం సరైనది కాదన్నారు. ముఖ్యమంత్రి గత ఎన్నికల సందర్భంగా పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని వాగ్దానం చేశారనీ, 9 ఏండ్లు గడిచినా నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వేతనాలు పెంపు కోసం ప్రభుత్వం రూపొందించిన జీవో నెంబర్ 60 ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బందికి 19వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా నేడు కేవలం రూ 8500 లు మాత్రమే చెల్లిస్తూ వారిచే వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అధికారం చేపట్టగానే జిపి కార్మికుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యస్.సి సెల్ జిల్లా అధ్యక్షులు బోడ్డు బోందయ్య, ఉన్నం రాజశేఖర్, పాలేరు నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ బచ్చలికూరి నాగరాజు, జూలకంటి సాగర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజని, మండల మహిళా అధ్యక్షురాలు రేగూరి వాసవి, జెర్రిపోతుల సత్యనారాయణ, గుగులోతు మోహన్, బత్తుల రమేష్ మదారు, యువజన కాంగ్రెస్ నాయకులు యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్, లంజపల్లి వీరబాబు, పగిడిమర్రి అజయ్, చిట్యాల రమేష్, గట్టిగుండ్ల విజయ్, ధనవత్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ డి వార్మింగ్ డే సందర్భంగా సమావేశం



**మధిర,జూలై19(మనం న్యూస్):** నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మధిర మండలంలో ఉన్న 1–19 సం. వయస్సు ఉన్న మొత్తం 14,560 మంది పిల్లలకు గ్రామంలో, అంగన్వాడి సెంటర్స్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యందు, రెసిడెన్షియల్ స్కూల్స్ నందు, ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలల యందు,ప్రభుత్వ పాలిటెక్నిక్ నందు అలానే డిగ్రీ కళాశాలలో 19 సంవత్సరాల్లో పిల్లలందరికీ ఈ మాత్రలను భోజనము తర్వాత చప్పరించటం కానీ నమిలి మింగటం కానీ చేయవలెనని, ఫిట్స్ ఇతర పెద్ద అనారోగ్యములు ఉన్న పిల్లలు తప్ప మిగిలిన అందరూ వేసుకోవచ్చు అని, మాటూరు పేట, దెందుకూరు వైద్యాధికారులుడాక్టర్ వెంకటేష్, డాక్టర్ పృధ్వీ తెలియపరిచారు.ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.కె. సిలార్ సాహెబ్, ఎంపీ ఓ శాస్త్రి, ఐసిడిఎస్ సూపర్వైజర్స్, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రావు, ఆరోగ్య పర్యవేక్షణ అధికారులు గోవింద్, శరత్ బాబు, భాస్కర రావు, మోక్షరాణి పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు...
### ఖమ్మం ఎక్సైజ్ సహాయక కమీషనర్ గణేష్



**మధిర,జూలై19(మనం న్యూస్):** ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఖమ్మం ఎక్సైజ్ సహాయక కమీషనర్ గణేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిలుగుమాడు లో ఉన్న చేయూత మత్తు పదార్థాల నిరోధక కార్యాలయం వద్ద నుండి ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవటం ద్వారా ఆరోగ్యం చెడిపోవటమే కాకుండా కుటుంబ కలహాలు రావటానికి అవకాశం ఉందన్నారు. మీ పిల్లల బంగారు భవిష్యత్ కోసం వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు ఎవరైనా తీసుకున్నా, విక్రయించినా పీడీ యాక్ట్, జిల్లా బహిష్కరణ తదితర కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధిర ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఎస్సైలు చంద్రశేఖర్, శార్వాణి కానిస్టేబుళ్లు గోపయ్య , ముస్తఫా పాల్గొన్నారు.

## నేడు ఉచిత మెడికల్ క్యాంప్

**బోనకల్, జూలై 19(మనం న్యూస్) :** బోనకల్ కో ఆపరేటివ్ సొసైటీ కాంప్లెక్స్‌లో లేబర్ కార్డు ఉన వారికి ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సిఐటియు బోనకల్ మండల కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ క్యాంప్‌లో 50 రకాల పరీక్షలు చేయనున్నట్లు తెలిపింది. బిపి, షుగర్, థైరాయిడ్, విటమిన్ డి, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్, గుండె, క్యాన్సర్, ఎలర్జీ సంబంధిత సమస్యలకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపింది. లేబర్ కార్డు తీసుకుని వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరింది.

## రాహుల్ గాంధీపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు



**ఏన్కూరు, జూలై 19(మనం న్యూస్):** రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాచారం దేవస్థానం మాజీ చైర్మన్ దళపతి భువనేశ్వర్ రాజు తెలిపారు. ఏన్కూరులో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేసే పనులు కేటీఆర్ కు క్లబ్బులు, పబ్బుల్లా కనిపిస్తున్నాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే ధైర్యం లేకనే టిఆర్ఎస్ పార్టీ నాయకులు, మంత్రులు కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణ చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రను, రాహుల్ గాంధీ కుటుంబ సభ్యులు చేసిన త్యాగాలను, వారి పదవులను టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఒకసారి తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఉచిత విద్యుత్తుకు కాంగ్రెస్ పార్టీ ఏనాడో కట్టుబడి ఉందని, దానిపై లొల్లి చేసే బిఆర్ఎస్ నాయకులకు త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్తారని విమర్శించారు. జిల్లాలో పొంగులేటికి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమించి పేదలకు అన్యాయం చేసింది ఎవరో ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే అన్ని తేలుస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మల నాగేశ్వరరావు, గంగాదేవుల నాగరాజు, ఇమ్మడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అడిషినల్ కలెక్టర్, ఆర్‌డిఓలు బదిలీ

**ఖమ్మం, జూలై 19(మనం బ్యూరో) :** ఖమ్మం అడిషినల్ కలెక్టర్ మధుసూదన్ హైదరాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఖమ్మానికి మధుసూదన్ నాయక్ రానున్నారు. కొత్తగూడెం ఆర్‌డిఓగా పని చేస్తున్న స్వర్ణలత ఖమ్మం రానున్నారు. ఖమ్మం డిఆర్‌ఓగా పని చేస్తున్న శిరీష కొత్తగూడెం ఆర్‌డిఓగా బదిలీ అయ్యారు. భద్రాచలం ఆర్‌డిఓగా మాధవి రానున్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల పోరాటానికి మద్దతు
### రౌండ్ టేబుల్ సమావేశం లో అఖిలపక్ష పార్టీల నాయకుల వెల్లడి





**బోనకల్, జూలై 19(మనం న్యూస్) :** సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు తమ మద్దతు ఉంటుందని సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, టిడిపి, ఇతర ప్రజాసంఘాల నాయకులు వెల్లడించారు. స్థానిక ఎస్ఆర్ కళ్యాణ మండపంలో మరీదు పుల్లయ్య అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం లో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, టీడీపీ మండల అధ్యక్షులు రావుట్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొని మాట్లాడారు. గత 14 రోజులుగా పంచాయతీ కార్మికులు తమ సమస్యల కోసం పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమైన విషయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశం కానీ దేశంలో ఎక్కడో మీడియాలో మాట్లాడితే స్పందించి ధర్నాలు, రాస్తారోకోలు చేసిన అధికార పార్టీ నాయకులకు కళ్ళ ముందు పోరాటం చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పోరాటం కనిపించడం లేదా? అని వారు ప్రశ్నించారు. ఈ రోజుల్లో బిల్డింగ్ వర్కర్స్ గా పని చేసే వారికి రోజుకి 600 నుండి 1000 రూపాయల వేతనం వస్తుండగా గ్రామపంచాయతీ సిబ్బందికి 300 ఇవ్వటమేందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే విడుదల చేసిన జీవోలలో కనీస వేతనం 480 ఒక రోజుకు ఉందని, అదే రాష్ట్ర ప్రభుత్వం ఆ జిఓను ఉల్లంఘించడం దారుణమైన విషయం అన్నారు. కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అంచలంచలుగా పోరాటాలు చేస్తున్నారని, వీలైనంత త్వరగా జేఏసీ నాయకులను చర్చలకు పిలిపించి వారి సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రావూంజనేయులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం నరసింహారావు, తెలుగు రైతు ఖమ్మం జిల్లా అధ్యక్షులు నందమూరి సత్యనారాయణ, సిఐటియు నాయకులు వీరబాబు కుక్కల కోటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ బంధం శ్రీనివాసరావు, గార్లపాడు సర్పంచ్,జానకిపురం సర్పంచ్ చిలక వెంకటేశ్వర్లు, రావినూతల ఎంపీటీసీ కందిమల్ల రాధా, మాజీ సర్పంచులు గుగులోతు పంతు, షేక్ వజీర్, తదితరులు పాల్గొని మద్దతు తెలియజేశారు.

## సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ యూఎస్పిసి ఆధ్వర్యంలో ర్యాలీ
### తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేత




**ఎర్రుపాలెం,జూలై19(మనం న్యూస్):**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉపాధ్యాయ వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ యు ఎస్ పి సి ఆధ్వర్యంలో ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నుండి తహశీల్దార్ ఆఫీస్ వరకు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం త హశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నూతన పెన్షన్, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, గురుకుల పాఠశాలలో సిబ్బంది రెగ్యులర్ చేయాలని, కేజీబీవీ పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, బదిలీలు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని మన ఊరు మనబడి పాఠశాలలో పెండింగ్ వర్కులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే స్కావెంజర్ల నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్పిసి నాయకులు అనుమోలు కోటేశ్వరరావు, బండారు నాగరాజు, బావ్సన్, ముత్తయ్య, హనుమంతరావు, కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావు, వీరన్న చిన్ని, నాగమణి, మహేంద్ర, శంకర్, రవి పాండురాజు, రాము, నీల అజయ్, ఆమంచి సత్యనారాయణ, డి జగదీష్, పివి రమణమ్మ పద్మ, తస్సిరూన్నిస బేగం, నాగమణి ఉమామహేశ్వరి, కృపావతి, సీతారామలక్ష్మి, సత్యవతి ,శశిధర్ నాయక్ ,రవి శంకర్ ,ఎం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, డివి శ్రీను, సుబ్బరామరాజు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో జోరుగా వర్షం

--ఇళ్లకే పరిమితమైన ప్రజలు
--అప్రమత్తమైన అధికారులు



**కారేపల్లి, జూలై19 (మనం న్యూస్) :** మండల వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జోరుగా వర్షం కురిసింది. ఒకటిన్నర రోజుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇళ్ళకే పరిమితమయ్యారు. అనేక చోట్ల రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తూ చెరువులను తలపించింది. రాష్ట్ర వాతావరణ శాఖ కారేపల్లి మండలంలో వంద మిల్లి మీటర్ల వర్షపాతం నమోదయ్య అవకాశం ఉందని తెలపడంతో మండల అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. తహశీల్దార్ శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాల పరిస్థితి పై సమీక్షించారు. కారేపల్లి ఎస్ఐ రామారావు లోతట్టు ప్రాంతాల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆ ప్రాంత ప్రజాప్రతినిధులతోటి సమన్వయం చేశారు. గత జూన్ నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్న మండలం గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొంత ఉపశమనం కలిగింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షంతో వాగులు చెరువులలోకి నీరు చేరడంతో ఆయకట్టు రైతులు ఆనందం వెలిబుచ్చుతున్నారు.

## స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేసిన సర్పంచ్ దంపతులు



**మధిర,జూలై 19(మనం న్యూస్):** ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని దెందుకూరు గ్రామ సర్పంచ్ కోట విజయశాంతి వెంకటకృష్ణ దంపతులు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని,విద్యార్థులకు సర్పంచ్ కోట విజయశాంతి వెంకట కృష్ణ దంపతులు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడుతూ, సమయాన్ని వృధా చేయకుండా చదువుతున్నప్పుడే పై చదువులకు చేరుకోగలరని అన్నారు.చదువుపై ఏకాగ్రత చూపించినప్పుడు ప్రథమ స్థానంలో నిలుస్తారని చెప్పారు.ఉన్నత చదువులకు చేరుకొని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాధు సమాధానం ,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జేవిఆర్ ఈపిసి సిహెచ్‌పిని సందర్శించిన సింగరేణి అధికారులు





**సత్తుపల్లి, జూలై 19(మనం న్యూస్):** సింగరేణి జేవిఆర్ ఈపీసీ సిహెచ్ పిసిని బుధవారం సింగరేణి జనరల్ మేనేజర్ యమ్ షాలెం రాజు, ఏరియా ఇంజనీరింగ్ రఘురామిరెడ్డి తో కలిసి జెవిఆర్ ఈపీసీ సిహెచ్ సిని సందర్శించారు, అన్ని కోల్డ్ స్టాక్ బంకర్లను క్షుణ్ణంగా పరిశీలించారు, కోల్డ్ అంతరాయం లేకుండా నిరంతరం బెల్ట్స్ పైకి జారుటకు తగు సలహాలు సూచనలు చేశారు, ఈ విధంగా చేయటం వలన రోజుకు సులువుగా 8 రేకులు రవాణా చేయవచ్చని తెలిపారు, సిహెచ్ పి బంకర్ చుట్టూ పక్కల జస్ట్ డస్ట్ మరియు బొగ్గు లేకుండా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు, అనంతరం హెచ్ పి సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో జిఎం ని ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో రఘురామిరెడ్డి ఏరియా ఇంజనీర్ కోటిరెడ్డి ఎస్ ఓ, జిఎం సోమశేఖర్, సిహెచ్ పి ఇన్చార్జ్ రమణారెడ్డి, సెక్యూరిటీ ఆఫీసర్ ఇంజనీర్లు, రాకేష్, మోహన్ ,ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల నియామకాలు

**సత్తుపల్లి, జూలై 19(మనం న్యూస్):** సత్తుపల్లి ప్రభుత్వ జలగం వెంగళరావు డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తాత్కాలిక ప్రతిపాదికల నియమకాల చేపట్టేందుకు గాను అధితి అధ్యాపకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పానెం రామచంద్ర రావు ఒక ప్రత్యేక ప్రకటనలో తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా కమిషన్ ఉత్తర్వుల ప్రకారం 2023 –2024 కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు(01) ఇంగ్లీష్ (01) డైరీ సైన్స్ (01) హిస్టరీ (01) పోస్టులకు సంబంధించిన అతిథి అధ్యాపకులు నియమకాలు ది 22. 7.2023. నాడు ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా చేపట్లనున్నట్లు తెలియజేశారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం శాతం మార్కులు ఎస్సీ ఎస్టీ దివ్యాంగులకు 50శాతం మార్కులు కలిగి ఉండాలని సెట్ నెట్ పీహెచ్డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి బయోడేటా, తో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 21న సాయంత్రం 4:00 లోపు కళాశాలలో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9963329249 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్ఐ రవికుమార్



**దమ్మపేట, జూలై 19(మనం న్యూస్) :** దమ్మపేట మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దమ్మపేట ఎస్ఐ రవికుమార్ ప్రజలను కోరారు. అధిక వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు ఇంటి వద్దనే ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలతో పాటు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, ఇంట్లో పిల్లలను సైతం బయటకి రానీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని వాగులన్నీ ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని, ఈ నేపథ్యంలో గేదెల కాపరులు, రైతులు సైతం ఈ కాలువలు దాటవద్దు అని, అదే నేపథ్యంలో ఇండ్లల్లో ఉండి ఆరోగ్య క్షేమరిత్యా ప్రతి ఒక్కరూ వేడి నీటిని తాగాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్మికులు దీక్షలో ఉన్నందున పరిసరాలలో పరిశుభ్రతను ప్రజలే శుభ్రం చేసుకొని, నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు చూసుకోవాలని ఎస్ఐ తెలిపారు. ఎటువంటి ఇబ్బందులూ ఉన్నా 100 కి గానీ స్టేషన్ ఆఫీసర్ కి గానీ కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



## సమస్యపై సకాలంలో స్పందించిన సర్పంచ్

**కల్లూరు, జూలై 19( మనం న్యూస్):** అకాల వర్షంతో లోతట్టు ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని గ్రామస్తుల చేసిన ఫిర్యాదు మేరకు యర్రబోయినపల్లి గ్రామ సర్పంచ్ సింగిశాల పద్మ ప్రసాద్ తక్షణమే స్పందిచి సమస్యను పరిష్కరించారు. గత రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న ఎడతెరపని వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజల అవసరాలను గుర్తించి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి నీరు చేరకుండా స్థానిక బిఆర్ఎస్ నాయకుల సహకారంతో గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె లో ఉండడం వల్ల తాత్కాలిక కార్మికులతో డ్రైనేజీ కాలువను వేయించి నీరు బయటకు పోయే విధంగా చేయించారు. వర్షం కురుస్తున్నప్పటికీ వర్షంలోనే దగ్గరుండి పని చేయించటంతో చెప్పిన వెంటనే స్పందించిన సర్పంచ్ ని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు రేషన్ డీలర్ల జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు సింగిశాల ప్రసాద్, కిలారి రామారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆహార భద్రత , భారత్ ఆహార సంస్థల్లోనే సాధ్యం

### ఎఫ్.సి.ఐ డివిజనల్ మేనేజర్ రంగప్రసాద్ సామాక్



**ఖమ్మం, జూలై 19(మనం బ్యూరో) :** ఆజాద్ కి అమృత మహోత్సవం సందర్భంగా దేశంలో ఆహార భద్రత విషయంలో భారత ఆహార సంస్థ కీలక పాత్ర పోషిస్తుందంటూ ఖమ్మం ఎఫ్.సి.ఐ డివిజనల్ మేనేజర్ రంగప్రసాద్ సామాక్ అన్నారు . కేంద్ర ప్రభుత్వ 9సంవత్సరాల పాలనలో చేపట్టిన పలు పథకాలను ప్రజలకు అందించే విషయంలో ఎఫ్.సి.ఐ కీలకమైన పాత్ర పోషించిందని పేర్కొన్నారు . ఖమ్మం డివిజన్ పరిధిలో 88,000 ఎంటీ ల సామర్థ్యం గల రెండు గోధములలో బియ్యం నిల్వ చేస్తున్నట్లు వివరించారు . గతంలో అందించిన బియ్యం కాకుండా కొన్ని పోషక విలువలు గల బియ్యాన్ని ప్రజలకు అందజేయడం జరుగుతుందని వివరించారు . ఈ సంవత్సరం 2022-23 సం? కి గాను 1 లక్ష 60 వేల ఎంటీ ల బియ్యాన్ని సేకరించటం జరిగిందని తెలిపారు . ఈ విధంగా సేకరించిన బియ్యాన్ని మన రాష్ట్ర తో పాటు దేశ నలుమూలకి రైలు మార్గం ద్వారా వివిధ రాష్ట్రాలకు సరఫరా చేయటం జరిగిందన్నారు . రైతులకు గిట్టు బాటు ధర ను అందించటలో ఎఫ్.సి.ఐ. అధికారులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**దమ్మపేట, జూలై 19(మనం న్యూస్):** దమ్మపేట అర్బన్ కాలనికి చెందిన తాళ్ళ సురేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బైక్ మీద ప్రయాణం చేస్తుండగా స్కూల్ బస్సు ఢీకొనడంతో,, అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భౌతిక కాయాన్ని కాంగ్రెస్ అశ్వారావుపేట నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ సందర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నులి పురుగుల నివారణ అవగాహన ర్యాలీ...



**అన్నపురెడ్డిపల్లి, జూలై 19 (మనం న్యూస్ ):** మండల పరిధిలో గల పెద్దిరెడ్డి గూడెం గ్రామపంచాయతీ ఎర్రగుంట పి హెచ్ సి నందు బుధవారం డాక్టర్ తన్మయి అధ్యక్షతన ప్రజల్లో అవగాహన కోసం జాతీయ నూలు పురుగుల నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల, మల విసర్జన చేసినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల , మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల గాని, ఇలాంటి ప్రక్రియలు చేయకపోవడం వల్ల శరీరంలోని జీర్ణక్రియలోకి పోయి నులు పురుగులు ఏర్పడతాయన్నారు. నులు పురుగుల నివారణ కోసం మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పటికప్పుడు చేతులు, కాళ్లు శుభ్రపరుచుకోవడం, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్ నాగేశ్వరావు, హెచ్ వి శారారాణి, హెచ్.పీ విజయలక్ష్మి, వరప్రసాద్, ఎం ఎల్ హెచ్ పి రాందాస్, కోటేశ్వరరావు, ఏఎన్ఎం ఎంఎస్ లక్ష్మి, ఏఎన్ఎం జ్యోతి, ఫార్మసిస్ట్ ప్రసాద్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలిక కార్మికులను అడ్డుకున్న పంచాయతీ కార్మికులు



**అశ్వరావుపేటటౌన్, జులై 19(మనం న్యూస్ ):** అశ్వరావుపేట పట్టణంలో పంచాయతీ కార్మికులు 14 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం నాడు అధికారులు తాత్కాలిక కార్మికులు ఏర్పాటుచేసి పని చేపించే ప్రయత్నం చేస్తుండగా అడ్డుకున్నారు .పోలీసులు, పంచాయతీ అధికారులకు రెండు చేతులు జోడించి నమస్కరించి తమ పొట్ట కొట్టొద్దు అని బతిమిలాడుకున్నారు. అయినా ససేమీరా అనడంతో పోటీ కార్మికులతో పనిచేస్తుండగా అడ్డుకున్నారు.




## విద్యార్థులకు సమాజంపై అవగాహన



**దమ్మపేట, జూలై 19(మనం న్యూస్) :** మండలంలోని పార్కెల గండి గిరిజన పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఐటీడీఏ సహకారంతో విద్యార్థులకు సమాజం పై అవగాహన కల్పించేందుకు వాయిస్ 4గరల్స్ ఎన్జివో సంస్థ ద్వారా శిక్షణ కల్పించారు. దీనిలో భాగంగా పార్కెల గండి బాలుర ఆశ్రమ పాఠశాలలో 7,8,9 తరగతులు చదువుతున్న 250 మందికి 10 రోజులుగా ఫీల్ కోఆర్డినేటర్ గోపీనాథ్, కౌన్సిలర్లు: భరత్, లోకేష్, కృష్ణ చైతన్య, సుబ్రమణ్యం, సంపత్ విఘ్నేష్, సాయి పృథ్వీ, శివరాం నాయక్, సంజయ్ రెడ్డి, అన్వేష్ నాయక్, ప్రఫుల్ వైష్ణు, విజయ్ సాగర్ శిక్షణ కల్పించారు. దీనిలో భాగంగా బుధవారం పాఠశాలలో చివరి రోజు ప్రదర్శన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథి గా పాటశాల హెచ్ ఎం ధర్మ హాజరై ప్రసంగిస్తూ ఈ క్యాంప్ ను తమ పాఠశాలలో నిర్వహించడం, విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళికలపై అవగాహన కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు అత్యంత ఉత్సాహభరితంగ ప్రసంగం, నృత్య ప్రదర్శన, గాన ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, చదువు లో నైపుణ్యత, భవిష్యత్తు ప్రణాళిక, ఆరోగ్యకరమైన జీవనం, ఆరోగ్యకరమైన బంధాలు, స్వీయ అవగాహన తదితర అంశాల గురించి ప్రదర్శనలు చేశారు.

# గోదావరి వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ ప్రియాంక
## బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలి
## భద్రాచలం డివిజన్లో పర్యటించిన కలెక్టర్

**భద్రాచలం, జూలై 19( మనం న్యూస్ ):** వరద ముంపుకు గురయ్యే ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. బుధవారం భద్రాచలం ఆర్డీఓ కార్యాలయపు సమావేశపు హాలులో గోదావరి వరదలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి ప్రమాద హెచ్చరికలను బట్టి ముంపుకు గురికాకుండా ముదస్తుగా ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో సురక్షిత మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వైద్య సేవలు అందించాలని చెప్పారు. నీరు చేరే వరకు ప్రజలు వేచి ఉండకుండా యంత్రాంగానికి సహకరించి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని చెప్పారు. రానున్న మూడు రోజుల పాటు విస్తారమైన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచనలు నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలకు ఇళ్ల నుండి బయటకు రావొద్దని చెప్పారు. రోడ్లపైకి నీరు చేరిన ప్రాంతాల్లో రవాణా నియంత్రణ చేసేందుకు బారికేడింగ్ ఏర్పాటుతో పాటు ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అత్యసవసర సేవల దృష్ట్యా సిబ్బందికి అన్ని రకాల సెలవులు రద్దు చేసినట్లు చెప్పారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు.

అత్యసవర సేవలకు కొరకు కలెక్టర్ కార్యాలయంలో 08744-241950, వాట్సాప్ నెంబర్ 9392919743, కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో 9392919750, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో 08743-232444, వాట్సప్ నెంబర్ 7981219425 ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నెంబర్లు 24 గంటలు పనిచేస్తాయని ఫోన్ చేసి కానీ, వాట్సాప్ నెంబర్లుకు మెసేజ్, వీడియో ద్వారా కానీ సమస్యను తెలియచేయాలని చెప్పారు. అత్యవసర సేవలు అందించేందుక మందులు, అంబులెన్సులు, ఆర్డీఎస్కే వాహనాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రసవాల తేదీలు సమీపంలో ఉన్న గర్భిణులను గుర్తించి ఆసుపత్రుల్లో చేర్పించాలని చెప్పారు. వరద ముంపు మండలాల్లో ఈ నెలలో 129 మంది, రానున్న నెలలో 518 మంది ఉన్నట్లు గుర్తించామని వారందరిని ముందస్తుగా ఆసుపత్రుల్లో చేర్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అత్యవసరంగా రక్తం అందించేందుకు రక్త నిల్వలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. అత్యవసర సేవలు కొరకు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఐసియూ ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని, ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తక్షణమే సరఫరా చేసేందుకు వీలుగా ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసేందుకు ముందస్తు సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న ఐదు నెలలకు సరిపోను నిత్యావసర వస్తువులు స్టాకులో ఉంచాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. 5 వేల లీటర్ల డీజిల్, 2 వేల లీటర్ల పెట్రోల్ నిల్వలు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా వాక్సినేషన్ చేయాలని చెప్పారు. ముంపుకు గురికాకుండా లోతట్టు ప్రాంతాల్లోని పశువులను ఎత్తైన ప్రాంతాల్లోకి తరలించాలని చెప్పారు. గజ ఈతగాళ్లు, నాటు పడవలు అందుబాటులో ఉంచాలని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా నియంత్రణ చేయాలని చెప్పారు. వరద రోజుల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని మిషన్ బగీరథ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా మంచినీటి సమస్య వస్తే తక్షణమే ట్యాంకర్లు ఏర్పాటు ద్వారా మంచినీరు సరఫరా చేయాలని చెప్పారు. నిరుపయోగంలో ఉన్న మంచినీటి బోర్వెల్స్ మరమ్మత్తులు నిర్వహించి వినియోగంలోకి తేవాలని చెప్పారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రావొద్దని చెప్పారు. అత్యవసర సేవలకుఅగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. వరదల సమయంలో రైతులు పంటసాగు పనులు వాయిదా వేసే విధంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని వారి సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. గోదావరికి ఎగువ నుండి వచ్చే వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని ముంపు ప్రాంత ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని చెప్పారు. దేవాలయం పరిసరాల్లోని స్నాన ఘాట్ల వద్ద భక్తులు నదిలోకి దిగకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ముంపు వాటిల్లే అవకాశం ఉన్నట్లు బారికేడింగ్లు, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. పట్టణంలో చేరిన వరద నీటిని తొలగించేందుకు 500 హార్స్ పవర్ కలిగిన విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అనంతరం విస్తా కాంప్లెక్సు వద్ద మురుగునీరు తొలగించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లును పరిశీలించారు. అత్యవసరంగా వినియోగించుకునేందుకు వీలుగా అదనపు మోటార్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అత్యవసర సేవలకు కెటిపిఎస్, సింగరేణి, బిపిఎల్ తదితర కర్మాగారాల రెస్క్యూ టీములను అందుబాటులో ఉంచాలని చెప్పారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ రమాకాంత్, ఆర్ అండ్ బి ఈ ఈ భీమ్లా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్, పశు సంవర్ధక శాఖ డిడి పురందర్, ముంపు మండలాల తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

## డిసిసి అధ్యక్షులు పోదెం వీరయ్య..
## మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం.

**కరకగూడెం జులై 19(మనం న్యూస్):** కరకగూడెం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని భద్రాచలం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిసి అధ్యక్షులు పోదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం.వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జెడ్పి చైర్మన్,చందా. లింగయ్య దొర ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలత పినపాక నియోజకవర్గం టిపిసిసి సభ్యులు డాక్టర్ చ ం దా . స ం తో ష కుమార్,మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు .అనంతరం కరకగూడెం అంబేద్కర్ సెంటర్ నందు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుండి కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నేటి బిఆర్ఎస్ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పార్టీ నాయకుల్లో చిన్న బిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతు ప్రజా సమస్యలపై పోరాటమే తమ అంతిమ లక్ష్యం అని అన్నారు. రానున్న ఎన్నికలలో పినపాక నియోజకవర్గం గడ్డమీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేస్తా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎల్ డి ఎం ఇన్చార్జి మోత్కూరి ధర్మారావు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహిముద్ ఖాన్, నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటబోయిన. నాగేశ్వర రావు, యువజన విభాగం అధ్యక్షులు కొర్స.ఆనంద్, నియోజకవర్గ నాయకులు బట్టా.విజయ్ గాంధీ, జెడ్పిటిసి కొమరం. కాంతారావు,సమత్ భట్టుపల్లి సర్పంచ్ పోలెబోయిన.శ్రీవాణి,భట్టుపల్లి సర్పంచ్ తోలెం.నాగేశ్వరరావు, ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు నాయకులు పాల్గొన్నారు.






# 3 గంటల కరెంటు ఇస్తానంటున్న కాంగ్రెస్

## మూడు పంటలకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్న బిఆర్ఎస్
## ఆలోచించు ఓ రైతన్న : ఎంఎల్ఏ హరిప్రియ

**ఇల్లందు, జూలై 19 (మనం న్యూస్):** ఇల్లందు మండలం సూది మల్ల గ్రామపంచాయతీలో రైతు వేదిక నందు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంఆ ఆమె మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు 3 గంటల కరెంట్ చాలు 24 గంటల ఉచ్చిత కరెంట్ అవసరం లేదు చేసిన వాఖ్యలకు వ్యతిరేకంగా రైతు వేదికల దగ్గరా రైతుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల గెలవక ముందే ఇలా ప్రగల్భాల్ పలికితే గెలిచిన తర్వాత ప్రజలకు ఏం మేలు చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ దాసం ప్రమోద్, పిఎసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కుంజ కృష్ణ సుభాష్ నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ, మండల అధ్యక్షుడు శీలం రమేష్, ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, రైతు కమిటీ సభ్యులు పూనం కమలమ్మ, కోఆప్షన్ సభ్యులు ఘాజి, ఉప సర్పంచ్ తాండ్ర నాగరాజు, ఇంద్ర నగర్ వార్డ్ నెంబర్ నీలం రాజశేఖర్ పాల్గొన్నారు...



# పోడు సాగుదారులందరికి పట్టాలు ఇవ్వాలి

## సాగుదారులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

**చర్ల జులై 19 (మనం న్యూస్ ) :** చర్ల మండల కేంద్రంలో సిపిఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పోడుభూములు ఇచ్చేదాంట్లో కంటితుడుపు చర్యలు చేస్తుందని అరాకొరాగా కొద్దిమందికి కొన్ని పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు స్వార్థ రాజకీయ ప్రయోజనాలకోసం ప్రజలకీ ఆశచూపించి ప్రజలను మోసాంజేస్తే సహించమని అన్నారు పోడు భూములు సాగు చేసుకుని జీవిస్తున్న గిరిజనులు ఆదివాసీలతో పాటు ఇతర పేదలు వలస ఆదివాసులకు అటివి హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారుపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు బేషారతుగా వెంటనే ఎత్తివేయాలని, తిరస్కరించామని పక్కన పెట్టిన పూడు దరఖాస్తులను పున పరిశీలించి పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రేగా ఆంద్రయ్య కణితి భాను ప్రకాష్, రాజు, సురేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు



# మణుగూరు లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

## ఉత్తమ ప్రెసిడెంట్ గా దండా రాధా కృష్ణ – ఉత్తమ సెక్రటరీ గా భూక్యా తార



**మణుగూరు, జూలై 19 (మనం న్యూస్) :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉమ్మడి ఖమ్మం నల్గొండ జిల్లా (320ఈ) ఇన్స్పైర్ అవార్డ్ ప్రదాన కార్యక్రమంలో , ఉమ్మడి ఖమ్మం నల్గొండ జిల్లాల్లో, ప్రెసిడెంట్ దండా రాధాకృష్ణ సారధ్యంలో లయన్స్ క్లబ్ మణుగూరు, కమిటెడ్ క్లబ్ గా మొదటి స్థానం సాధించింది. వ్యక్తిగత అవార్డుల విభాగంలో , దండా. రాధా కృష్ణ బెస్ట్ ప్రెసిడెంట్ గా, భూక్యా . తార బెస్ట్ సెక్రటరీ గా, పీల్లారి షెట్టి.హరిబాబు కమిటెడ్ లయన్ లీడర్ గా, భూక్యా. ప్రసాద్ కమిటెడ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ గా, గాజుల.రమేష్ కుమార్ బెస్ట్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ గా అవార్డులు అందుకున్నారు. క్లబ్ కార్యక్రమంల విభాగంలో, లయన్స్ క్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో లయన్ లీడర్ భూక్యా.ప్రసాద్ , అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు జూనియర్ లెక్చరర్ గా పనిచేస్తూ ,సామాజిక బాధ్యత స్ప ృహ కలిగి ఉచిత మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించిన సంధర్భంగా హంగర్ రిలీఫ్ అవార్డు, వరదల సమయంలో నిరాశ్రయులైన వారికి అండగా నిలిచి చేసిన సేవకు కమిటెడ్ క్లబ్ అవార్డ్, ఎన్విరాన్మెంట్ అవార్డులు వరించాయి. గత 28 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ మణుగూరు వ్యవస్థాపక అధ్యక్షులు గా ఉంటూ లయన్ లీడర్ లను తయారు చేస్తున్న హరిబాబు కు బెస్ట్ మోటివేటర్ లయన్ లీడర్ అవార్డు, లియో క్లబ్ ఏర్పాటు చేసిన కారణంగా, బెస్ట్ డి.సీ అవార్డు, ఇతర విభాగాలలో 12 అవార్డులు అందుకున్నారు . ఈ సందర్భంగా, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ తీగల మోహన్ రావు చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. అవార్డులు ఇస్తున్న క్రమంలో, గవర్నర్ అఫిషియల్ విజిట్ సంధర్భంగా ఒకే రోజు 28 కార్యక్రమలను డిజైన్ చేసి, ప్రారంభింప చేసిన లయన్ లీడర్ తారప్రసాద్ ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లు, 85 క్లబ్ ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు నేపథ్యంలో జాగ్రత్తలు వహించండి...

## విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి..



**కరకగూడెం, జూలై 19 (మనం న్యూస్):** కరకగుడెం మండలం లోని అన్ని గ్రామాల విద్యుత్ వినియోగదారులు, ప్రజలు, రైతు సోదరులు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి తెలిపారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన సందర్భంగా, మూడు రోజుల వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న కారణంగా, మీ దగ్గరలో కానీ, మీ ఇంటిలో గాని, తడి చేతుల తో విద్యుత్ పరికరాలను, తీగలను ముట్టుకోవద్దని సూచించారు. ముఖ్యంగా బట్టలు ఆరేసే దండంకు విద్యుత్ వైర్లుకు తాకకుండా చూసుకోండని, విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లకు ఎలాంటి అతుకులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఒక వేళ అలాంటి అతుకుల వైర్లను వెంటనే అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్ తో మార్పించాలని, ఆరుబయట విద్యుత్ స్తంభాలను తాకవద్దని సూచించారు. రైతులు ట్రాన్స్ఫార్మర్ల దగ్గరికి వెళ్లవద్దని, మీ స్టార్టర్ డబ్బాలను నీటిలో తడవకుండా పైకి ఏర్పాటు చేసుకోగలరని, స్టార్టర్ డబ్బాలు ఇనుపవి కాకుండా పి.వి.సి డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆరు బయట ఉన్న ఇనుప స్తంభాలను ముట్టుకోకండి,మీ కనుచూపు మేర ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి నట్లయితే, కరెంటు తీగలు తెగిపడినట్లయితే, విద్యుత్(కరెంటు) ద్వారా ఎలాంటి ప్రమాదం ఉందని తెలిసిన వెంటనే మీ కరెంట్ ఆఫీస్ కి కానీ, మీ లైన్ మెన్ కు కానీ, ఏఈకి కానీ తెలియజేయాలని కోరారు.

# పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నారాటి ప్రసాద్



**ఆళ్లపల్లి, జులై 19 (మన న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు ఉద్యోగులు వారి సమస్యలపై చేస్తున్న సమ్మెను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి (జిల్లా అధ్యక్షుడు) నారాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో పాల్గొని సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్నారు, జీవో నెంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని, ప్రతి నెల సక్రమంగా జీతాలు చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే ఇవ్వాలని కోరారు, జీవో నెంబర్ 51 ని రద్దు చేసి ప్రతి ఒక్క గ్రామపంచాయతీ కార్మిక, ఉద్యోగులకు 5 లక్షల ఇన్సూరెన్స్, 10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జేఏసీ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ యూసఫ్, ఏఐటీయూసీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ సలహాదారు, జేఏసీ జిల్లా కమిటీ మెంబర్ ఆర్.కిషోర్ కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, కోఆప్షన్ మెంబర్ షేక్ రహీమ్, వార్డ్ మెంబర్ రేసు సురేందర్, మాజీ ఎంపీటీసీ, సీపీఐ జాయింట్ సెక్రటరీలు కొమరం హనుమంతరావు, వజ్జ పగడయ్య, కార్మికుల మండల అధ్యక్షుడు పి.ప్రభుదాసు, ప్రధాన కార్యదర్శి ఎం.శేఖర్, సభ్యులు ఏలియా, ముసలయ్య, కన్నయ్య, రాజన్న, అనసూర్య, కిరణ్, క్రిష్ణ, కుమారి, నిట్ట ప్రమీల, రాంబాబు, నర్సయ్య, రామ్మూర్తి, కీసరి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి 'దోస్త్' ప్రవేశాల కౌన్సెలింగ్

**ఖమ్మం, జూలై 19(మనం న్యూస్) :** శుక్రవారం నుంచి,24వ తేదీ సోమవారం వరకు తమ కళాశాల లో మొదటి సంవత్సరం డిగ్రీ లో దోస్త్ ద్వారా మూడు విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ఎస్ ఆర్ బి.జి.ఎన్.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంత విద్యార్థులు సకాలంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. పదవ తరగతి మార్కుల జాబితా, 1నుంచి ఇంటర్ వరకు స్టడీ/కండక్ట్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, సీటు కన్ఫర్మేషన్ పత్రం, ఇంటర్ టీ.సి, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ ధ్రువీకరణ (1-1-2023 నుండి తీసుకున్నది), 4పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్స్ తోపాటు రెండు సెట్లు జిరాక్సులు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల దోస్త్ కన్వీనర్ డా.ఎం.సుబ్రమణ్యం ను సంప్రదించాలని సూచించారు

# గోదావరి వరదలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి



**భద్రాచలం, జూలై 19( మనం న్యూస్ ):** గోదావరి వరదల శాశ్వత పరిష్కారం కోసం సీఎం కేసీఆర్ భద్రాచల ప్రాంతానికి వచ్చి ప్రకటించిన 1000 కోట్ల నిధులను విడుదల చేయమని అనేక సార్లు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన ,ఒక్క రూపాయి కూడావిడుదల చేయలేదని, ఇప్పటికైనా వరద నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోలేదని భద్రాచలం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సరేళ్ల నరేష్ పేర్కొన్నారు. జూలై రెండవ వారంలో గోదావరికి వరదలు రావడం వలన ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉందని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. భద్రాచలం అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత బిఆర్ఎస్ నాయకులకు లేదని, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ 8 సంవత్సరాల క్రితం శ్రీ రామ నవమికి భద్రాచలం కు వచ్చి రామాలయ అభివృద్ధికి 100 కోట్లు, పోయిన సంవత్సరం గోదావరి ప్రజల పరామర్శకు వచ్చి గోదావరి వరదల శాశ్వత పరిష్కారంకు 1000కోట్లు ప్రకటించారని, నిధులను మాత్రం విడుదల చేయలేదని తెలిపారు. వెంటనే నిధులను విడుదల చేసి భద్రాచలం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

## నూతన పెరివిజన్ కమిషన్ ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్



**మణుగూరు, జూలై 9 (మనం న్యూస్) :** మణుగూరులో ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భోజన విరామ సమయంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్ పి సి నాయకులు, టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ మీరా హుస్సేన్, కారం సీతారామయ్య మాట్లాడుతూ... నూతన పెరివిసన్ కమిషన్ను వెంటనే ఏర్పాటు చేసి (ఐ.ఆర్. )మధ్యంతర భృతి ప్రకటించాలని, సిపిఎస్ ను నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు పరచాలని, ఉపాధ్యాయుల పదోన్నతులు,బదిలీలను వెంటనే చేపట్టాలని, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం చొరవ తీసుకొని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బురద మయంగా రహదారి



**బూర్గంపహాడ్, జూలై 19 (మనం న్యూస్):** బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామపంచాయతీ వెనుక వీధి లో రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో సంవత్సరాలు గడుస్తున్న వారికి రహదారి లేకపోవడం, రోడ్డు నిర్మించకపోవడం వారి దురదృష్టంగా భావిస్తున్నట్లు ఆ ప్రాంత నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామపంచాయతీ వెనకాలే ఉన్న అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. వర్షం వస్తే అంతా బురద మయంగా మారుతుంది. ఆ ప్రాంతంలో రాకపోకలకు నరకయాతన పడటం ఆనవాయితీగా వస్తుందని, ఆ వీధిలో ఉన్నవాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తూ ఉన్నారు. పిల్లలు వృద్ధులు ఆ రహదారిలో రావాలన్న వెళ్లాలన్న రాకపోకలు సాగించాలన్న నానా అవస్థలు పడుతున్నారని ఈ రోడ్డు ని ఎవరూ పట్టించుకోరా మా పరిస్థితి ఇంతేనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అవసరాల కోసం ప్రధాన రహదారికి వెళ్లడానికి తాత్కాలికంగానైనా మరమ్మతులు చేసి రాకపోకలు సాగించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రజాప్రతినిధులను గ్రామస్తులు కోరుతున్నారు.

# అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండాలి

## – సామాజిక కార్యకర్త నవీన్ బాబు



**పినపాక, జులై 1(మనం న్యూస్ ) :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పాత రెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోగల చింతల బయ్యారం గ్రామంలో పొనగంటి పార్వతమ్మ పూరి ఇల్లు పూర్తిగా కూలిపోయిన విషయం తెలిసిందే...ఈ విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త నవీన్ బాబు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి 10 వేల రూపాయల నగదు తో పాటు 50 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. దీనితో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి రేకులు, ఫోల్స్ వెంటనే అందచేస్తామని తెలియజేశారు. మానవత్వం చాటుకున్న నవీన్ బాబును పలువురు అభినందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొనగంటి రామకృష్ణ, కురుకూరు శ్రీనివాసరావు, సతీష్, సమ్మయ్య, కిషోర్,పొనగంటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి




**భద్రాచలం ,జూలై 19 (మనం న్యూస్):** సమాజంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా ఐక్యమత్యంగా ఉండి ఎదుర్కొని ముందుకు పోయినప్పుడే తప్పనిసరిగా విజయం సాధించవచ్చునని ఏ సి ఎం ఓ రమణయ్య విద్యార్థినిలకు సూచించారు. బుధవారం భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ ముగింపు సమావేశానికి ఆయన హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలు తోటి విద్యార్థులతో ఒకరికొకరు పరిచయం చేసుకొని ఏమైనా సమస్యలు ఉంటే ధైర్యంగా చెప్పి సమస్యను పరిష్కరించుకోవాలని, ఆ సమస్యలను మనసులో పెట్టుకొని తలుచుకుంటూ ఉంటే అనారోగ్యానికి గురవడమే కాక చదువుపై శ్రద్ధ చూపలేరని అన్నారు. అలాగే ఆడపిల్లల వ్యక్తిగత సమస్యలు ఉంటే తోటి విద్యార్థులతో చెప్పుకోవాలని ,అలాగే తల్లిదండ్రులకు తెలియజేసి సమస్య జటిలం కాకుండా చూసుకోవాలని, అవసరమైతే సంబంధిత ఉపాధ్యాయులకు తెలియజేయాలని ముఖ్యంగా వారి ఆరోగ్యపరంగా జాగ్రత్తగా చూసుకోవాలని పేర్కొన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు వారు ఉండే తరగతి గదులను కూడా శుభ్రం చేసుకున్నప్పుడే ఎటువంటి అనారోగ్యానికి గురికారని అన్నారు. బయట సమాజంలో నెలకొన్న సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడానికి లీడర్షిప్ తప్పనిసరి అని,ధైర్యంగా ముందుకు పోయినప్పుడే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని ,ఇటువంటి సలహాలు సూచనలు గ్రామంలో ఉన్న ప్రజలకు కూడా తెలియజేసి వారిని చైతన్యవంతులుగా తయారుచేసి గ్రామంలో నెలకొన్న సమస్యలను తీర్చే విధంగా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఏటీడీవో నరసింహారావు, హెచ్ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో పొంగులేటి పర్యటన

**ఖమ్మం, జూలై 19(మనం న్యూస్) :** తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు. మధ్యాహ్నం 03.00 గంటలకు కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామం మీదుగా ఖమ్మం చేరుకుంటారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని డీసీసీ కార్యాలయాన్ని (సంజీవ రెడ్డి భవన్) సందర్శిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పొంగులేటి పర్యటనను విజయవంతం చేయగలరని దయాకర్ రెడ్డి కోరారు.

## 'గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల కు దరఖాస్తుల ఆహ్వానం

**ఖమ్మం, జూలై 19(మనం న్యూస్) :** స్థానిక ఎస్ ఆర్ బి.జి ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో 2023-24వార్షిక విద్యా సంవత్సరానికి, కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను అనుసరించి గెస్ట్ లెక్చరర్స్ గా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థులనుండి 22వ తేది శనివారం సాయంత్రం ఐదుగంటలవరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ -4, బి.బి.ఏ-2, కెమిస్ట్రీ -2,బి.సి.ఏ-2, కంప్యూటర్ అప్లికేషన్స్ -5, స్టాటిస్టిక్స్ -1 మొత్తం 16 పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.ఇంటర్వ్యూలు ఈ నెల 25 తేదిమంగళవారం పదిగంటల నుండి కళాశాల ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు తగిన అర్హతల సర్టిఫికెట్స్ జిరాక్సులతో దరఖాస్తు చేయాలన్నారు. ఇంటర్వ్యూ రోజున ఒరిజినల్ సర్టిఫికెట్స్ తోపాటు రెండు సెట్లు జిరాక్సులతో హాజరు కావాలని తెలిపారు. సంబంధిత పి.జి .లో55 శాతం మార్కులు, ఎస్.సి, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు ఉండాలి, పిహెచ్.డి,నెట్/ సెట్ గల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. పై అర్హతలు కలిగిన అభ్యర్థులు లభించని పక్షంలో , అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వారు ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్స్ సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రందించాలని తెలిపారు.

## కులగణనను చేపట్టాలని 26 పార్టీల డిమాండ్ చేయటాన్ని స్వాగతిస్తున్నాం

### జాతీయ బిసి సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్



**ఖమ్మం, జూలై 19(మనం న్యూస్) :** రెండు రోజులుగా బెంగళూరులో జరిగినటువంటి 26 విపక్ష పార్టీల సమావేశంలో దేశంలో కులగణన ను చేపట్టాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేయటాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నుంచి మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని ఆ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. దేశంలో 56% బిసి జనాభా ఉన్నప్పటికీ విద్యా , ఉద్యోగ , రాజకీయ రంగాల్లో మా వాటా దక్కటం లేదని ఆయన స్పష్టం చేశారు . మేమెంతో మాకంతా వాటా అంటూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో దశాబ్దాలుగా పోరాటాలు నిర్వహిస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన రెండు రోజుల విపక్ష పార్టీల సమావేశంలో ఈ దేశంలో ఉన్నటువంటి బీసీలను కులాలు వారిగా లెక్కలు తీయాలని డిమాండ్ చేయటం మంచి పరిణామం అని అన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కులగణన అంశానికి మద్దతు పలికిందని ఎన్నికలు వచ్చిన ప్రతి సందర్భంలో బీసీల మీద కపట ప్రేమను చూపించే బి.ఆర్.ఎస్ ప్రభుత్వం బీసీ కులగణన పైన ఎందుకు నోరు విప్పటం లేదని, ఇప్పటికైనా బీసీ కులగణన పై తమ వైఖరిని తెలపాలని ఆయన డిమాండ్ చేశారు .

# 24గంటల కరెంట్ ఎక్కడ

### రైతులను నమ్మిస్తూ మోసం చేస్తున్నది బీఆర్ఎస్ సర్కార్
### రైతులకు అండగా నిలిచింది కాంగ్రెస్ సర్కార్
### రైతు వేదికలను బీఆర్ఎస్ భవనాలను చేశారు..
### రఘునాథపాలెం మండల రైతు వేదిక వద్ద కాంగ్రెస్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా





**రఘునాథపాలెం, జూలై 19(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల కరెంట్ ఇస్తున్నారో చూపిస్తారా..?, రైతు వేదికలు ఏ రైతుల కోసం ఉపయోగించారో చూపిస్తారా..? రైతు వేదికలను పార్టీ వేదికలుగా మార్చేశారని ఖమ్మం పీసీసీ సభ్యులు, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావిద్ ఆరోపించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు ఖమ్మం నియోజకవర్గం లోని రఘునాథపాలెం రైతు వేదికకు అనేక మంది రైతులు పరిశీలించేందుకు వెళ్ళారు. అక్కడ రైతు వేదికకు తాళాలు వేసి ఉండటంతో రైతు వేదికను చూసి పిసిసి సభ్యులు మొహమ్మద్ జావేద్ ను పిలువగా రైతు వేదికకు వచ్చినటువంటి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు వేదికల లోపలికి చొచ్చుకు వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు పోలీసులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. గాంధీల పాలనలో వ్యవసాయ రంగానికి బాటలు పడ్డాయని,నేటి పాలకులు వ్యవసాయాన్ని దగా చేస్తున్నారని మండిపడ్డారు. లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రుణమాఫీ వెంటనే చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రఘునాథపాలెం రైతు వేదిక వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు వేదిక వద్దకు చేరుకొని రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేయాలని నిరసనకు దిగారు. అక్కడ నిరసనకు దిగిన కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున నినాదాలు చేశారు 24 గంటలు విద్యుత్ సరఫరా రైతులకు ఉండట్లేదని చెప్పారు ఇప్పటివరకు రైతుబంధు రైతుల ఖాతాల్లో జమ కాలేదని అన్నారు. ధరణి లోపల వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని రైతు వేదిక దగ్గరికి వస్తే గేట్లకు తాళాలు వేసి ఉన్నాయని మధ్యాహ్నం 12 గంటలకు తాళాలు తెరచుకోలేదని నకిలీ విత్తనాలు రైతుబంధు రుణమాఫీ 24 గంటల ఉచిత విద్యుత్తు ఇలాంటి అనేక అంశాల మీద చర్చ చేసుకుందామని వచ్చిన రైతులు రోడ్డు మీద నిరసన చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పువ్వాడ అజయ్ కుమార్ రైతు వేదికలని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు మార్చారని, కాంగ్రెస్ పార్టీని తిట్టడానికి మాత్రమే రైతు వేదికలను ఉపయోగిస్తున్నారని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సింది పోయి సోయి లేకుండా కాంగ్రెస్ నాయకులను తిట్టడమే లక్ష్యంగా భావించి రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో 2 వ డివిజన్ కార్పొరేటర్ మలిదు వెంకటేశ్వర్లు, రఘునాథ పాలెం మండల అధ్యక్షులు భూక్యా బాలాజీ, కొంటేముక్కుల నాగేశ్వరరావు, కోటేరు నర్సి రెడ్డి, మారం కరుణాకర్ రెడ్డి, దారవత్ రామ్మూర్ ,సర్పంచ్ బాతుల రమణ సుధాకర్ యాదవ్, తుమ్మల పల్లి నర్సింహారావు, మంద గోపి,ఆలస్యం సూరయ్య, రాంబాబు,కొంగర నరేష్,అంగోత్ వెంకన్న, బొడ రవి, రమణ, రెంటాల ప్రసాద్, జోనాబోయిన పాపయ్య,మూజహిద్, వీరయ్య గౌడ్,,ఇర్జలా కృష్ణ, గోపి,వల్లభనేని నర్సింహారావు, మలది వెంకన్న, అర్వపల్లి శివ, తెలురి భాస్కర్, మోగతల కిరణ్, తది తరులు పాల్గొన్నారు.

# స్నేహాలత మొగిలి సేవలు అత్యుత్తమం

### ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ గౌతమ్





**ఖమ్మం, జూలై 19(మనం బ్యూరో) :** జిల్లా సమగ్రాభివృద్ధికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా స్నేహాలత మొగిలి అత్యుత్తమ సేవలు అందించారని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా పనిచేస్తూ, బదిలీపై గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమీషనర్ గా వెళ్లిన స్నేహాలత మొగిలి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాకు మొదటి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా నియమింపబడి, 3 సంవత్సరాలకు పైగా జిల్లాలో విశిష్ట సేవలు అందించారన్నారు. గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలు బలోపేతం తోనే బంగారు తెలంగాణ సాధ్యమని మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వం అదనపు కలెక్టర్ పోస్టులు ఏర్పాటుచేసిందని ఆయన తెలిపారు. జిల్లాలో పల్లె, పట్టణ ప్రగతి, దళితబంధు, మన ఊరు-మన బడి లాంటి ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమలులో జిల్లా ఉన్నత స్థానంలో నిలుచుటలో స్నేహాలత పాత్ర ఎంతో ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం పొంది, ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచారని, మార్గదర్శకంగా నిలిచారని కలెక్టర్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవిలో బదిలీపై వెళుతున్నారని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి మాట్లాడుతూ, విధి నిర్వహణలో స్వేచ్ఛ నిచ్చి ప్రోత్సాహించారని, ఖమ్మం లో పనిచేయడంతో మంచి అనుభవమని, విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన అదనపు కలెక్టర్ ని జిల్లా కలెక్టర్, అధికారులు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎన్. మధుసూదన్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా అధికారులు, ఎంపిడిఓ లు, మునిసిపల్ కమీషనర్లు, ఎంపీఓ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక ల్యాబ్ సౌకర్యంతో కావ్య హాస్పిటల్

## రెండు గంటల్లోనే వ్యాధి నిర్ధారణ హార్మోన్ల సమస్యలకు చక్కని పరిష్కారం





**ఖమ్మం, జూలై 19(మనం న్యూస్) :** అందుబాటులో హార్మోన్స్ మరియు విటమిన్స హార్మోన్ల ఇన్ బ్యాలెన్స్‌కు , షుగర్ , థైరాయిడ్ , విటమిన్ సమస్యలతో పాటు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు చక్కని పరిష్కారం చూపేందుకు ఖమ్మంలోని కావ్య హాస్పిటల్ ముందు వరుసలో ఉంటోందని ప్రముఖ ఎండీ , ఫిజీషియన్ , ఎండో క్రైనాలజీ విభాగంలో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న డా. కావ్యచంద్ యాలమూడి స్పష్టం చేశారు . కావ్య హాస్పిటల్ స్థాపించిన ఏడాదిన్నర కాలంలోనే అనేక మందికి అత్యుత్తమైన వైద్య సేవలు అందించినట్టు తెలిపారు . ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు ప్రధానంగా షుగర్ , థైరాయిడ్ , హార్మోన్ల సమస్యలు , ఎండో క్రైనాలజీ విభాగానికి సంబంధించి అనేక రకాల వైద్య సేవలు అందిస్తున్నామని డా.కావ్య తెలిపారు . తాజాగా కావ్య హాస్పిటల్ లో అధునిక ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు . ప్రస్తుతం హార్మోన్స్ , విటమిన్స్ ఎనల్కైజర్ యంత్రం అందుబాటులో ఉందన్నారు . ఈ ఆధునిక యంత్రం తో కేవలం రెండు గంటల్లోనే హార్మోన్లు , విటమిన్ సమస్యలను పసిగట్ట వచ్చని అన్నారు . ఈ సందర్భంగా కావ్య హాస్పిటల్స్ చైర్మన్ రవీందర్ యలమూడి , ప్రసూన పారుపల్లి మరియు సిబ్బంధి పాల్గోని హర్షం వ్యక్తం చేశారు . వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారికి కేవలం రెండు గంటల్లోనే సమస్యను గుర్తించేలా ఆధునిక యంత్రాన్ని అందుబాటులో ఉంచామన్నారు . ఈ యంత్రంతో మహిళలకు సంబంధించి ఈస్ట్రోజన్ , ప్రొజెస్ట్రాన్ , హార్మోన్ల అసమతుల్యత , థైరాయిడ్ , ప్రొఫైల్ , ప్రొలాక్టింగ్ లెవెల్స్ , ఎఫ్ఎస్‌హెచ్ , ఎల్‌హెచ్ , సీరమ్ , క్వార్టిసాల్ , లెవెల్స్ , విటమిన్ బి12 , విటమిన్ డి , ఐరన్ ప్రొఫైల్ స్థాయిలను ఇట్టే పసిగట్టే యంత్రాన్ని అందుబాటులో ఉంచామన్నారు . పురుషులకు సంబంధించి హార్మోన్ల సమస్యలు , యాండ్రోజన్స్ , టెస్టోస్టిరాన్ , కార్డియాక్‌కు సంబంధించి బయో మార్కర్ , ట్రాపోనిన్ , సీబీకేఎంబీ , సీఆర్‌పీ , డి , డ్రైమర్ , ప్రోకాల్‌సోటిన్ , జనరల్ టెస్టులు అన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు . వీటితో పాటు చికెన్ గన్యా , లోప్టోస్పైరా , డెంగ్యూ , మలేరియా , వివిధ రకాల వైద్య పరిక్షలు తక్కువ ధరల్లోనే అందుబాటులో ఉన్నాయన్నారు .

**అనతి కాలంలోనే అరుదైన సేవలు**

కావ్య హాస్పిటల్ స్థాపించిన అతి కొద్ది కాలంలోనే ఉమ్మడి జిల్లాతో పాటు , చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు తమ హాస్పిటల్ లో ఎన్నో రకాల అత్యుత్తమైన వైద్య సేవలు అందించినట్టు డా.కావ్య తెలిపారు . ఎండో క్రైనాలజీ విభాగానికి సంబంధించి షుగర్ , హార్మోన్ల అసమతుల్యత , థైరాయిడ్ , విటమిన్ సమస్యలకు చక్కని పరిష్కారం చూపామన్నారు . రాబోవు రోజుల్లో మరిన్ని సేవలు విస్తరించి ప్రజలకు ఆధునిక వైద్యంలో అత్యుత్తమ వైద్యం అందిస్తామని డా.కావ్య స్పష్టం చేశారు .

# టిఎస్–ఐపాస్ దరఖాస్తులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలి

## అధికారులకు కలెక్టర్ విపి గౌతమ్ సూచనలు



**ఖమ్మం జులై,19 (మనం బ్యూరో) :** జిల్లాలో యూనిట్ల స్థాపనకు టిఎస్–ఐపాస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించి, అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుదవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి టీఎస్–ఐపాస్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 61 యూనిట్ల స్థాపనకుగాను 100 అనుమతులకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయన్నారు. 88 దరఖాస్తులను అనుమతించడం జరిగిందని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంబంధించి 2 దరఖాస్తులు అనుమతి కొరకు పరిశీలనలో ఉన్నాయన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి 1 దరఖాస్తుకుగాను అనుమతుల ప్రక్రియ ప్రగతిలో ఉందన్నారు. ఫ్యాక్టరీలకు సంబంధించి 2 దరఖాస్తులకుగాను 1 దరఖాస్తుకు అనుమతి ఇవ్వగా, 1 దరఖాస్తు పరిశీలనలో ఉన్నాయన్నారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 2 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పరిశీలన ప్రక్రియలో దరఖాస్తులు తిరస్కరించక, దరఖాస్తుదారునితో ఆయా అనుమతికి కావాల్సినవి సమర్పణకు వారికి సహకరించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జిఎం ఇండస్ట్రీస్ అజయ్ కుమార్, ఎల్డిఎం శ్రీనివాస్ రెడ్డి, రవాణా శాఖ అధికారి కిషన్రావు, ఇ.డి ఎస్సీ కార్పోరేషన్ నవీన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కృష్ణనాయక్, ఏడి మైన్స్ సంజయ్కుమార్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జయప్రకాష్, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి శ్యాంప్రసాద్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ

## పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మెచ్చా



**దమ్మపేట, జూలై 19(మనం న్యూస్) :** అశ్వరావుపేట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూమి పూజ పనులను ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తో కలిసి అశ్వరావుపేట శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం మొదటి దశలో రు. 39కోట్లతో 2.5కె పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఖర్చు చేస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఆయన సొంత నియోజకవర్గంగా భావించి ఏది అడిగినా వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేస్తున్నారని అన్నారు. ఆయిల్ ఫామ్ రైతులకు ఇబ్బందీ కలగకూడదనే ఉద్దేశంతో మంత్రి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ సహకారంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా స్పందించిన సీఎం వెంటనే 150 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2000 నుంచి 2500 మందికి ఉపాధి కలిగే అవకాశంగా ఉందన్నారు. మొదటి దశలో రూ.39కోట్లతో 2.5కె పవర్ ప్లాంట్ నిర్మాణానికి అనుమతి మంజూరు అయినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు, రావు జోగేశ్వరరావు, దమ్మపేట జెడ్పీటీసీ ఐదెంటేశ్వరరావు, అశ్వారావుపేట ఎంపీపీ, జెడ్పీటీసీ, దమ్మపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు,ఎంపిటిసిలు,సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,మండల నాయకులు,ఆయిల్ ఫామ్ రైతులు,పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

# సిపిఎం కార్యకర్తల జోలికొస్తే పాతాళానికి తొక్కేస్తాం

## రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



**తిరుమలాయపాలెం, జూలై 19(మనం న్యూస్) :** సిపిఎం కార్యకర్తల నాయకుల జోలికొస్తే పాతాళానికి తొక్కేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండల పరిధిలోని దమ్మాయిగూడెం గ్రామంలో బోడపట్ల సతీష్ ఇంటిపై గుర్తుతెలియని దుండగులు దాడి చేసి కారు అద్దాలతో పాటు ఇంట్లో ఉన్న సామాన్లను ధ్వంసం చేసి కంప్యూటర్ హార్డ్ డిస్క్ లను ఎత్తుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న తమ్మినేని వీరభద్రం దమ్మాయిగూడెం గ్రామంలోని సతీష్ ఇంటిని పరిశీలించారు. కుటుంబ సభ్యుల్ని ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం కార్యకర్త, పత్రిక రిపోర్టర్ బోడపట్ల సతీష్ ఎదుగుదల చూడలేక కొందరు దుండగులు ఈ ఘటనకు పాల్పడ్డారని వారిని వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐ వరాల శ్రీనివాస్ తో ఫోన్లో తమ్మినేని మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తల నాయకుల జోలికొస్తే పాతాళానికి తొక్కేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండి రమేష్ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను డివైఎఫ్ఐ నాయకులు బషీర్ కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగటి సురేష్ రైతు సంఘం నాయకులు తుళ్లూరు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# కష్టంతో కాకుండా ఇష్టం తో చదివితే ఉత్తమ ఫలితాలు

## బీఎస్పీ పాలేరు నియోజవర్గ కన్వీనర్ డాక్టర్ అల్లిక



**తిరుమలాయపాలెం, జూలై 19 (మనం న్యూస్) :** చదువుతోనే జీవితం బాగుపడుతుందని పాలేరు బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ అల్లిక వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా చదువును మాత్రం విస్మరించవద్దని సూచించారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో అనే సామెతను ఆయన విద్యార్థులకు ఉదహరించారు. బుధవారం తిరుమలాయపాలెం మండలం తిరుమలాయపాలెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు విద్యార్థులకు 20 లీటర్ల సామర్థ్యం గల మూడు తాగునీటి టంబ్లర్లను అందజేశారు. మూడు భవనాలు ఉండగా ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేశారు. ఇదే మండలంలోని బలరాంతండాలో ప్రాథమిక పాఠశాలలో రెండు మరుగుదొడ్ల తలుపుల మరమ్మతులకు రూ.1500 చొప్పున సాయం అందించారు. వే దు ళ్ళచెరువు ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల శుభ్రం చేసేందుకు పనివారు లేకపోవడం డాక్టర్ అల్లిక పరిశీలనలో తేలింది. దీంతో సొంత ఖర్చుతో అక్కడికక్కడే నెలకు రూ.వెయ్యి చొప్పున వేతనం ఇచ్చేలా మహిళను మాట్లాడి పాఠశాలలో నియమించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ అల్లిక వెంట బీఎస్పీ జిల్లా ఇన్చార్జి పీసీ వీరస్వామి, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఈ రమేష్ యాదవ్, తిరుమలాయపాలెం మండల బీఎస్పీ అధ్యక్షుడు బిక్కునాయక్, మండల నాయకులు కోలిచలం శ్రీను, కొమ్ము వీరబాబు, గొడుగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ కుటుంబానికి ఆర్థిక సహాయం

## -- కుమారుడికి ఉద్యోగం కల్పించాలి

## -- వీఆర్ఏల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి



**కారేపల్లి రూరల్, జూలై 19 (మనం న్యూస్) :** మండల పరిధిలోని పేరుపల్లి రెవెన్యూ గ్రామ వీఆర్ఏ ఈసాల సత్య నారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం పేరేపల్లి లో జరిగిన సత్యనారాయణ దశదినకర్మకు మండల రెవెన్యూ అధికారులు హాజరై నివాళులర్పించారు. రెవెన్యూ సిబ్బంది తమ వంతుగా 11 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సత్యనారాయణ కుటుంబానికి అందజేసి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా వీఆర్ఏల సంఘం సహాయ కార్యదర్శి బొందల బాలరాజు మాట్లాడుతూ నిత్యం తమతోపాటు కలిసి విధులు నిర్వహించే సత్యనారాయణ మృతి విచారకరమన్నారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగించే సత్యనారాయణ కుమారుడు శ్రీనివాస్ కు కారుణ్య నియామకం ద్వారా సత్యనారాయణ నిర్వహించిన వీఆర్ఏ ఉద్యోగం కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో గిర్దావర్ భానుప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్, వి.ఆర్.ఏ నాయకులు జ్యోతిబాస్, శ్రీను, వినయ్, విజయ్, సురేష్, మనోజ్, కిషోర్, వెంకటి, చిన్నా, గురునాద్ పాల్గొన్నారు

# అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రత్యమ్నాయ చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కె.శశాంక



**మహబూబాబాద్, జూలై 19 (మనం ప్రతినిధి):** జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండి అవసరం ఉన్న చోట ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా అధికారులతో వివిధ మండలాల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రజలను అప్రమత్తం చేసేందుకుగాను అధికారులు అవసరం ఉన్న చోట తక్షణ నివారణ చర్యలను చేపట్టాలని ప్రతి మండల కేంద్రంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ గ్రామాలలో చెరువుల, కల్వర్టు డ్యాంలపై నీటి ప్రవాహన్ని అడిగి తెలుసుకున్నారు. కల్వర్టు రహదారులపై నీటి ప్రవాహం ఓవర్ ఫ్లో అయినట్లయితే ప్రజలను అప్రమత్తం చేసి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి దారి మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు అటువైపు వెళ్ళకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. పట్టణ, గ్రామ ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి అందులో ఎవరైనా ఉంటే వారిని సురక్షితమైన స్థలాలకు చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ముంపు ప్రాంతాల వారిని ఎగువ ప్రాంతానికి చేర్చాలన్నారు. పట్టణ కేంద్రాల్లో, గ్రామాల్లో కాలువల్లో చెత్తాచెదారంతో నిండకుండా ఎప్పటి కప్పుడు వాటిని శుభ్రం చేయాలని అధికారులను ఆదే శించారు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు ఎక్కడైనా పొరపాటున తెగినట్లయితే స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా హెచ్చరికలు జారీ చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు వర్షాభావ పరిస్థితులతో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రం నంబర్ 79950 74803 కు సంప్రదించాలని కోరారు.ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా అధికారులు, తహశీల్దార్ లు, స్పెషల్ ఆఫీసర్లు, మునిసిపల్ కమిషనర్లు, విద్యుత్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలి

## – కొత్త పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలి
## – ఎస్టియు జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరా చారి




**తొర్రూరు జూలై 19 (మనం న్యూస్):** ఎన్నికల కోడ్ రాకముందే ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్ టి యు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కె. సుధాకరా చారి తెలిపారు. బుధవారం తొర్రూరు పట్టణంలోని హైస్కూల్ లో ఎస్ టి యు జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకరాచారి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వస్తున్నందున దానికంటే ముందుగా పిఆర్సి కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని తెలియజేశారు. సిపిఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకరాలకు అనుగుణంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ పోస్టులను నింపుతూ,పండిట్ పీఈటి పోస్టులను అప్ గ్రేడ్ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.పాత పీఆర్సీ గడువు ఈ ఏడాది జూన్ తో పూర్తికానుందని, జూలై 1 నుంచి కొత్త పిఆర్సి అమలుకు నేటికీ కమిటీ నియమించకపోవడం శోచనీయమన్నారు.317 జీఓతో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారని, జీవో వల్ల తలెత్తే ఇబ్బందుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపలేదని తెలిపారు.ఉపాధ్యాయులకు రావాల్సిన 33 నెలల ఏరియర్స్ నేటికీ అందించకపోవడం దారుణమన్నారు. పదోన్నతులు, బదిలీలు లేక ఉపాధ్యాయులు ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి పని చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు.గ్రేడ్ 2 పండితులు పీఈటీల పదోన్నతులకు న్యాయపరమైన చిక్కులు తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు.ఎస్ జీటీ లకు ప్రధాన ఉపాధ్యాయులుగా పదోన్నతులు కల్పిస్తామని చెప్పిన హామీలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర ప్రకాష్, ప్రధాన కార్యదర్శి యాకూబ్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు యాకయ్య, జిల్లా కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు సిహెచ్ రమేష్, హరికృష్ణ చారి, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర విజయవంతం చేయాలి

## – టీఎస్సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్



**మరిపెడ, జూలై 19(మనం న్యూస్):** పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా అభి నహి తో కబీ నహి అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల గుండా తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం సితప్రజ్ఞ నేతృత్వంలో చేపట్టిన రథయాత్ర మహబూబాబాద్ జిల్లాకి గురువారం చేరుకుంటుందని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణ ఇల్లందు బైపాస్ రోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి మధ్యాహ్నం 2:00గం. లకు బైక్ ర్యాలీ ప్రారంభమై నూతన కలెక్టర్ కార్యాలయం మీదుగా కోర్టు సెంటర్ నుంచి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ వరకు బైక్ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ లో జిల్లాలోని సి.పి.యస్ ఉద్యోగ, ఉపాధ్యాయులతో సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మరుసటి రోజు ఉదయం 6.00 గం.లకు జూనియర్ కాలేజ్ గ్రౌండ్ వద్ద వాక్ ఫర్ ఓపియస్ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. పాత పెన్షన్ సాధన సంకల్ప సభలో సీపీఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ మరిపెడ మండల అధ్యక్షులు దోమల లింగయ్య, కరుణాకర్, నగేష్, శ్రీను, బాలు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు వరం సీఎంఆర్ఎఫ్ : ఎంపీపీ

**మరిపెడ, జూలై 19(మనం న్యూస్):** పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ వరమని, సీఎం రిలీఫ్ ఫండ్ కష్టసమయంలో ఆర్థిక చేయూతగా నిలుస్తోందని మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు అన్నారు. బుధవారం ఆమె మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిడిఓ కెలోత్ ధన్సింగ్ తో కలిసి తండ ధర్మారం గ్రామానికి చెందిన గుగులోతు జీజాకు మంజూరైన రూ.25 వేల చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్పతి, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

# ముద్దం బక్కమ్మ కి మంత్రి నివాళులు



**తొర్రూరు, జూలై 19 (మనం న్యూస్):** అమ్మాపురం గ్రామంలో ముద్దం బక్కమ్మ మరణించగా, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారు వారి మృతదేహం పై పుష్ప గుచ్చం ఉంచి, ఘన నివాళులు అర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మపురం సర్పంచ్ కడెం యాకయ్య జడ్పిటిసి శ్రీనివాస్ సీతారాములు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరి మనబడి పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్ కె.శశాంక



**మహబూబాబాద్, జూలై 19(మనం ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మన ఊరు మనబడి పనులకు సంబంధించిన పురోగతిని సంబంధిత అధికారులతో కలెక్టర్ శశాంక బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఒఎంబిలో చేపట్టిన పాఠశాలలను త్వరగా పూర్తి చేయాలని ఈ నెలాఖరు వరకు సాధ్యమైనన్ని పూర్తి చేసి అన్ని వసతులతో అప్పజెప్పాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న పనులను పాఠశాలలను తనిఖీ చేసి పరిశీలించాలన్నారు. వర్షాకాలం రిత్య ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ పనులను చేపట్టాలని అన్నారు. మండలంలో సాంక్షన్ అయి చేపట్టిన రోడ్లను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంచార్జ్ తహశీల్దార్ బి.పద్మావతి, ఎం.ఈ.ఓ శ్రీదేవి,డి.ఈ రవీందర్, ఎం.పి.డి.ఓ.వెంకటేశ్వర్లు,సర్పంచ్ సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**గార్ల జూలై 19(మనం న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల గార్లలో 2023–24 సంవత్సరానికి సబ్జెక్టుల భర్తీ కై అర్హులైన అభ్యర్థుల నుండి గెస్ట్ ఫ్యాకల్టి (అతిథి అధ్యాపక) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.నరసమ్మ బుధవారంనాడు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. కామర్స్–2, తెలుగు–1,కంప్యూటర్ సైన్స్–1 పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీ లో జనరల్ మరియు బిసి కేటగిరి అభ్యర్థులకు 55 శాతం మార్కులు, ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండవలెనని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పిహెచ్ డి నెట్ స్లేట్ ఉన్న వారికీ ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.సంబంధిత సబ్జెక్టులో భోధనానుభవము ఉన్న వారు సర్విస్ సర్టిఫికెట్లు జత చేయవలెనని కోరారు. అభ్యర్థుల శాలరీ కమీషనర్ ఇచ్చిన ప్రోసిడింగ్ ప్రకారము ఇవ్వబడుతుందని అప్లైచేసే అభ్యర్థులు తమ సర్టిఫికేట్స్ జిరాక్స్ ఒక సెట్ ని తీసుకొని గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ది 21న సాయంత్రం 04.00 గంటలలోపు కళాశాలలో అందజేయవలెనని తర్వాత వచ్చిన అప్లికేషన్స్ అనుమతించబడవు అని అన్నారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూ 22న ఉదయం 11:00 కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గార్ల లో నిర్వహించ బడుతుందని మరిన్ని వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నరసమ్మ ఫోన్ నెం.7036142044 ను సంప్రదించాలని కోరారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## – మరిపెడ తహసీల్దార్ రాంప్రసాద్



**మరిపెడ, జూలై 19(మనం న్యూస్):** భారీవర్షాల నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాన నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ఈ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం హెచ్చరించినట్లు తెలిపారు. ఏదైనా అత్యవసరం అయితే తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్.ఐ కి వెంటనే ఫోన్ కాల్ చేయాలని ఎమ్మార్వో ప్రజలకు సూచించారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల వాగులు, చెరువులు పొంగి పొర్లే అవకాశముందని, వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రమాదం పొంచి ఉన్నట్లుగా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. శిథిలావస్థలో ఉన్నటువంటి ఇండ్లు, కూలడానికి సిద్ధంగా ఉన్న ఇండ్ల ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో బయటకి వెళ్లకుండా చూడాలని, చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు.